



విన్నపాలు వినవలె..!

కూటమి ప్రభుత్వంపై హౌసింగ్ విభాగం అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోటి ఆశలు

టైమ్ స్కేల్ లేదా ఎన్ఎంఆర్‌లుగా ప్రకటించాలని వేడుకోలు

గృహ నిర్మాణ శాఖలో ఖాళీగా రెగ్యులర్ పోస్టులు

చేసేది బండెడు చాకిరీ

వైసీపీ ప్రభుత్వంలో సిబ్బందికి అన్యాయం

కూటమి ప్రభుత్వం తమను గుర్తించాలంటున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ఏళ్ల నుంచి శ్రమిస్తున్నారు. ప్రభుత్వాలు ఏవైనా సరే.. బండెడు భారాన్ని మోస్తున్నారు. గృహ నిర్మాణాల పురోగతికి పాటుపడుతున్నారు. అయినా వారి శ్రమకు మాత్రం తగిన ఫలితం, గుర్తింపు రావడం లేదు. గత ప్రభుత్వం వారిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వమైనా తమ మొరను ఆలకించి న్యాయం చేయాలని కోరుతున్నారు. వారే హౌసింగ్ విభాగంలో పనిచేసే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు. తమకు టైమ్ స్కేల్ ప్రకటించాలని, ఎన్ఆర్ఎంలుగా అయినా పరిగణించాలని డిమాండ్ చేస్తున్నారు. తద్వారా తమ సేవలకు గుర్తింపుగా రానున్న రోజుల్లో రెగ్యులర్ అయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లా హౌసింగ్ విభాగంలో పనిచేసే వారితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 2500 మందికిపైగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కూటమి ప్రభుత్వంపై కోటి ఆశలు పెట్టుకున్నారు. హౌసింగ్‌లో పనిచేసే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు టైమ్‌స్కేల్ వర్కర్లు, ఎన్ఎంఆర్‌లుగా ప్రకటించే కంటే కూడా వారిని క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఏం చేస్తున్నారంటే..

- ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) వంటి కేంద్ర పథకం అమలు చేయటంతో పాటు రాష్ట్ర భాగస్వామ్యంతో చేపట్టే ఇతర పథకాలను హౌసింగ్‌లోని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులే ముందుకు తీసుకువెళ్లారు.
- హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌లో వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు (డీఈఓలు), మండల ఇన్‌చార్జులు (ఎంఐసీ)గా పని చేస్తున్నారు. రెండు, మూడు మండలాలకు కలిపి ఒకే ఏఈ ఉంటున్నారు. దీంతో హౌసింగ్ పనుల భారమంతా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల మీదే పడుతోంది.
- పేదల ఇళ్ల నిర్మాణాలను గ్రౌండింగ్ చేయటం, వివిధ స్థాయిల్లో పురోగతి ఉండేలా చూసుకోవటంతోపాటు అనేక సాంకేతిక అంశాలను వీరే చూసుకునేవారు.
- కిందటి ప్రభుత్వ హయాంలో పేదల ఇళ్ల పనులను క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పట్టాలెక్కించేందుకు కృషి చేశారు.
- కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో హౌసింగ్ విభాగంలో పనిచేసే వర్కర్లంతా తమకు టైమ్‌స్కేల్ కల్పించాలని ఆందోళన చేపట్టారు. హౌసింగ్ విభాగంలోని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో బండెడు చాకిరీ చేయించిన వైసీపీ ప్రభుత్వం వారి విన్నపాన్ని కనీసం వినను కూడా వినలేదు. దీంతో హౌసింగ్ ఉద్యోగులు కూటమి ప్రభుత్వంపై కోటి ఆశలు పెట్టుకున్నారు. తమ శ్రమను గుర్తించి టైమ్ స్కేల్ కానీ, ఎన్ఎంఆర్‌లుగా ప్రకటించాలని కోరుతున్నారు.

ఏమి రుచి.. 'అన్న'

జిల్లాలో ప్రారంభమైన 'అన్న క్యాంటీన్లు' • పసందైన రుచులతో రూ.5కే భోజనం

అభ్యాగులు.. ఆకలేస్తే అన్నదానాల కోసం ఎదురుచూడాల్సిన పనిలేదు. కార్మికులు .. వచ్చే కూలి తిండీతిప్పలకు కూడా సరిపోవడం లేదని దిగులు చెందాల్సి అవసరం లేదు. సామాన్యులు... పూట భోజనానికి వందకుపైగా ఖర్చవుతుందని బెంగ పడనక్కర్లేదు. దేహీ అనే రోజులు పోయాయి. 'అన్న' అనే రోజులొచ్చాయి. రూ.15కే పసందైన రుచులతో ముప్పూటలా కడుపు నింపుతున్న 'అన్న క్యాంటీన్'లలో అభాగ్యులూ.. నిరుపేదలూ ఆనందంగా కడుపు నింపుకుటున్నారు. ఎవరిపైనా ఆధారపడాల్సిన పనిలేదనీ, రూ.5తో నిండైన భోజనం ఆరగించొచ్చనీ సంబర పడుతున్నారు. శుక్రవారం జిల్లాలోని పలుచోట్ల ప్రారంభమైన అన్న క్యాంటీన్లు నిరుపేదలు, సామాన్యులతో కళకళలాడాయి.



బందరులో వడ్డిస్తున్న మంత్రి కొల్లు, ఎంపీ బాలశౌరి




అన్న క్యాంటీన్ వద్ద బారులు తీరిన సామాన్యులు

అనకొండలను వదిలేసి..

రిజర్వు ఫారెస్టు అక్రమాల్లో చిరుద్యోగులపై వేటు

కొండలను పిండి చేసేశారు. వాటికి నామ రూపాల్లేకుండా చేశారు. పగలు, రాత్రి తేడా లేకుండా గ్రావెల్ తవ్వేశారు. వైసీపీ హయాంలో విజయవాడ రూరల్ మండలం, జి.కొండూరు మండలాల్లోని రిజర్వు ఫారెస్టు భూముల్లో గ్రావెల్ తవ్వకాలు విచ్చలవిడిగా సాగించారు. కొండలు మాయమవుతున్నా, సరిహద్దు రాళ్లను మాఫియా విసిరిపారేసినా జిల్లా అటవీ శాఖ అధికారులు కళ్లకు గంతలు కట్టుకున్నారు. అటవీ భూమి ఎక్కడా చెక్కు చెదరలేదని బుకాయించారు. చివరికి జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌ను, లోకాయుక్తను తప్పుదోవ పట్టించేలా అనకొండల్లాంటి అక్రమార్కులను వదిలేసి చిరుద్యోగులపై చర్యలకు సిద్ధపడటం గమనార్హం.



- జిల్లా అధికారులపై చర్యలు ఎప్పటికో
- వైసీపీ హయాంలో ముడుపుల మత్తులో అధికారులు
- అక్రమాలు జరిగినా ఏమీ లేదని బుకాయింపు
- ఫ్లయింగ్ స్క్వాడ్‌లోనూ దొంగలు
- అక్రమాల్లో పాత్ర పోషించిన అధికారులపై చర్యలకు డిమాండ్
- అధికారులపై డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు?

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడి, వేమవరం, పాతపాడు గ్రామాల్లో కొండలు, అటవీ ప్రాంతం ఉంది. ఈ భూములకు పక్కనే రెవెన్యూ భూములు ఉన్నాయి. వీటిలో తవ్వకాలు చేసిన మాఫియా మొత్తం సరిహద్దులను చెరిపేసింది. రెవెన్యూ భూములు దాటుకుని అటవీశాఖ భూముల్లోకి వచ్చింది. కొండల మధ్య ఉన్న భూమిని, కొండలను మాయం చేసింది. కొన్ని వేల క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌ను ఎక్స్‌కవేటర్లతో మాఫియా తవ్వేసింది. వీటి వెనుక జగన్‌కు అత్యంత సన్నిహితంగా ఉండే ఓ ప్రజాప్రతినిధి మొదలు అప్పటి ఎమ్మెల్యేలు, ఎంపీల ఉన్నారని చర్చ నడుస్తోంది.

ఇష్టానుసారంగా తవ్వకాలపై ఆయా గ్రామాల ప్రజలు, అటవీ శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. తవ్వకాలు అటవీ శాఖ భూముల్లో జరుగుతున్నాయని మ్యాప్‌లు, ఆధారాలతో సహా అందజేశారు. అయినా విజయవాడ కేంద్రంగా ఉండే ఇద్దరు అధికారులు మాత్రం అటువంటిదేమీ లేదని బుకాయించారు. ఐదేళ్లలో ఒక్కసారీ ఫిర్యాదులు వచ్చిన ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేసిన దాఖలాలు లేవు. ఈ ఇద్దరు అధికారుల వల్ల ఉపయోగం లేదని భావించిన ప్రజలు అటవీశాఖ ఉన్నతాధికారులకు, రాజమహేంద్రవరంలోని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌కు ఫిర్యాదు చేశారు. రాజమహేంద్రవరం నుంచి ఒక ఫ్లయింగ్ స్క్వాడ్‌ను నియమించారు. చివరికి ఈ మాఫియా ఫ్లయింగ్ స్క్వాడ్‌ను సైతం కొనేసింది.

ప్రజల ఫిర్యాదు.. పట్టించుకోని అధికారులు

అటవీశాఖలో అన్ని విభాగాలు మైనింగ్ మాఫియా ఇచ్చే నోట్ల కట్టల మత్తులో ఉన్నాయని భావించి జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్, లోకాయుక్తలో కేసులు నమోదు చేశారు. వాటి ఆదేశాలతో అటవీశాఖలోని విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగి అక్రమాలు జరుగుతున్న మాట వాస్తవమేని నివేదిక ఇచ్చారు. జిల్లాలో పనిచేస్తున్న ఉన్నతాధికారుల ప్రమేయం ఈ అక్రమాల్లో ఉందని తేల్చారు. కొండలు కరిగిపోయి, సరిహద్దు రాళ్లు చెరిగిపోయాయని నిర్ధారించారు. ఈ నివేదికను జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్, లోకాయుక్తకు పంపారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఈ రెండు సంస్థల నుంచి ఆదేశాలు వచ్చాయి.

అక్రమాలు నిజమని తేల్చిన విజిలెన్స్

ఇద్దరు చిరుద్యోగులపై వేటు

అధికారులు ఉన్నట్టుండి విజయవాడ రూరల్ మండలం బీట్ ఆఫీసర్ సునీతను సస్పెండ్ చేశారు. అప్పటి డిప్యూటీ రేంజర్ విజయ శేఖర్‌పై చర్యలకు సిద్ధమవుతున్నారు. నాడు రిజర్వ్ ఫారెస్టులో జరిగిన అక్రమ తవ్వకాలకు అండగా ఉన్న ఇద్దరు అనకొండలు విజయవాడలోని అటవీ శాఖ కార్యాలయంలోనే తిష్ట వేసుకుని కూర్చున్నారు. ఈ ఇద్దరు అధికారులే తప్పుడు నివేదికలను తయారు చేయించారని ఆరోపణలు బలంగా ఉన్నాయి. స్క్వాడ్ తనిఖీలకు వచ్చినప్పుడు ముందుగానే మాఫియాకు సమాచారం చేరవేసేవారు. అటవీశాఖలో ప్రతి ఉద్యోగికీ తెలిసిన బహిరంగ రహస్యం ఇది. కిందిస్థాయి ఉద్యోగులపై చర్యలు తీసుకుని, ఈ ఇద్దరు ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఇద్దరి అధికారులపై కొద్దిరోజుల్లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసి ఫిర్యాదు చేయడానికి ఆయా గ్రామాల ప్రజలు సిద్ధమవుతున్నారు.

మల్లవల్లికి మహర్దశ





ప్రారంభానికి ముస్తాబవుతున్న అశోక్ లేలాండ్

కృష్ణాజిల్లా మల్లవల్లి పారిశ్రామికవాడకు మహర్దశ రానుంది. 75 ఎకరాల విస్తీర్ణంలో అశోక్ లేలాండ్ బస్ బిల్డింగ్ యూనిట్ ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. సెప్టెంబరు 17న ఈ సంస్థను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. దీంతోపాటు పార్లే ఆగ్రో సంస్థ పనులు మళ్లీ గాడినపడ్డాయి. 6 నెలల్లో ఈ సంస్థ కూడా ప్రారంభానికి సిద్ధమయ్యే అవకాశాలు ఉన్నాయి.

- బస్ బిల్డింగ్ యూనిట్‌తోపాటు శిక్షణ కేంద్రం
- ప్రత్యక్షంగా 500 మందికి పరోక్షంగా 5వేల మందికి ఉపాధి
- చకచకా సాగుతున్న పార్లే ఆగ్రో పనులు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : బాపులపాడు మండలంలోని మల్లవల్లిలో బహుళ ఉత్పత్తుల పారిశ్రామిక పార్కు(మోడల్ ఇండస్ట్రియల్ పార్కు)ను ప్రారంభించాలని 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. 2017లో సుమారు 1350 ఎకరాల్లో మోడల్ ఇండస్ట్రియల్ పార్కుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇక్కడ భారీ పరిశ్రమలతోపాటు చిన్న, మధ్యతరగతి పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను నెలకొల్పేందుకు అనేక మంది పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారు. ఏపీఐఐసీ భూములు కూడా కేటాయించింది. అశోక్ లేలాండ్, పార్లే వంటి సంస్థలు ఆగమేఘాలపై పనులు ప్రారంభించాయి.

వైసీపీ హయాంలో అన్నీ దుర్దినాలే..

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మల్లవల్లి పారిశ్రామికవాడకు దుర్దినాలు మొదలయ్యాయి. ఇక్కడ కనీస మౌలిక సౌకర్యాల కల్పనపై వైసీపీ ప్రభుత్వం దృష్టి సారించలేదు. పారిశ్రామికవాడలో మౌలిక సౌకర్యాల కల్పన ఏపీఐఐసీ బాధ్యత. కానీ వైసీపీ సర్కార్ నిర్లక్ష్యం కారణంగా ఏపీఐఐసీ అధికారులు మల్లవల్లి వైపే చూడటం మానేశారు. దీంతో అప్పటికే పూర్తయిన అశోక్ లేలాండ్‌తోపాటు సగంపైగా పనులు పూర్తయిన పార్లే కూడా తమ యూనిట్ల ప్రారంభానికి వెనుకడుగు వేశాయి. వైసీపీ ప్రభుత్వ వేధింపులు తట్టుకోలేక పెట్టుబడులు పెట్టేందుకు కొత్తగా పారిశ్రామికవేత్తలు ఎవరూ ఇటువైపునకే రాలేదు. స్థలాలు కేటాయించిన

- మిగతా 4లో

హోసూరు పారిశ్రామికవాడలా అభివృద్ధి చెందాలి



తమిళనాడు రాష్ట్రంలోని హోసూరు పారిశ్రామికవాడను ప్రారంభించిన సమయంలో అశోక్ లేలాండ్, లక్ష్మీమిల్స్, టీవీఎస్ మూడు కంపెనీలు మాత్రమే అక్కడ ఉండేవి. ఆ కంపెనీల స్ఫూర్తితో ప్రస్తుతం అక్కడ 2వేల కంపెనీలు పనిచేస్తున్నాయి. అదే తరహాలో మల్లవల్లి పారిశ్రామికవాడ కూడా అభివృద్ధి చెందాలి. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించాలన్నదే నా ఆకాంక్ష. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సూచనలకు అనుగుణంగా త్వరలోనే మల్లవల్లి పరిశ్రమలతో కళకళలాడేలా తీర్చిదిద్దే బాధ్యతను నేను తీసుకుంటున్నాను.

– యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యే

లజ్జబండ డ్రెయిన్‌లో పనులు చేస్తున్న యంత్రాలు



నిర్లక్ష్యం ఆవరించి..

అప్రోచ్ రహదారి నిర్మాణానికి పామర్రు కాలువలో మట్టి తోలకం

- గుడివాడ మండలానికి చేరని సాగునీరు
- ఆయిల్ ఇంజన్లతో వరి పొలాలకు నీరు
- అయినా ఎండిపోతున్న పంటలు
- సాగునీరు విడుదల చేయాలని రైతుల వేడుకోలు

పామర్రు కాలువ ద్వారా గుడివాడ మండలంలోని శేరివేల్పూరు, సిద్ధాంతం పరిసర గ్రామాల ఆయకట్టులోని పంటపొలాలకు సాగునీందడం లేదు. గుడివాడ వద్ద ఫ్లైఓవర్‌కు అప్రోచ్ రహదారి పనులుచేసే క్రమంలో పామర్రు కాలువను మట్టితో పూడ్చి వేశారు. ఈ మట్టిని కొంతమేర తొలగించినా కాలువకు పూర్తిస్థాయిలో నీటి విడుదల జరగడం లేదు. కాలువల నిర్వహణ పనుల పేరుతో కొద్దిరోజులపాటు సాగునీటి విడుదలను నిలిపివేయడంతో మండలంలోని పలు గ్రామాలోని ఐదువేల ఎకరాల ఆయకట్టులోని పంట పొలాలు ఎండిపోయేస్థితిలోకి నెట్టివేయబడ్డాయి.



గుడివాడ మండలం శేరివేల్పూరు వద్ద ఎండిపోయిన వరిపొలం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : గుడివాడ మండలంలోని శేరివేల్పూరు, సిద్ధాంతం, శేరిదింటకుర్రు, నూజెళ్ల, చిరిచింతల, బొమ్ములూరు పరిసర గ్రామాల్లోని పంటభూములకు పామర్రు కాలువ ద్వారా సాగునీరు అందాలి. లోయర్‌పుల్లేరు కాలువపై ఉన్న బల్లిపర్రు లాకుల నుంచి పామర్రు కాలువ చీలుతుంది. పామర్రు కాలువకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేస్తుంటే పామర్రు మండలంలోని శివానిపురం నుంచి సాయిబాబా ఆలయం వరకు గట్లు బలహీనంగా ఉండి తెగిపోతుందనే కారణంతో నీటిని అరకొరగా విడుదల చేస్తున్నారు. వచ్చిన కొద్దిపాటి నీటిని ఎగువ ప్రాంత రైతులు మళ్లిస్తుండటంతో దిగువ గ్రామాలకు సాగునీరు చేరడం లేదు. గత 20 రోజులుగా విడుదల చేయకపోవడంతో వరి పొలాలు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి.

ఆయిల్ ఇంజన్లతో నీటిని తోడి..

కొద్దిపాటి నీటిని రైతులు ఆయిల్ ఇంజన్ల ద్వారా తోడి పంట పొలాలకు మళ్లిస్తున్నా పూర్తిస్థాయిలో నీరుపెట్టలేకపోతున్నారు. పొలాల మధ్య ఉన్న డ్రెయిన్‌లలో ఉన్న నీటిని సైతం పంటపొలాలకు తోడుతున్నా పూర్తిస్థాయిలో పంటపొలాలకు పెట్టడానికి అవకాశం లేకుండా పోతోందని రైతులు వాపోతున్నారు. మరో వారం రోజులపాటు కాలువ ద్వారా

- మిగతా 4లో



వరలక్ష్మిగా కనకదుర్గమ్మ

శ్రావణ శుక్రవారం సందర్భంగా ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు

4లో..



వరలక్ష్మిగా కనకదుర్గమ్మ

శ్రావణ శుక్రవారం సందర్భంగా ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు

వన్‌టౌన్, ఆగస్టు 16: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కనక దుర్గమ్మ వరలక్ష్మి రూపంలో దర్శనమిచ్చారు. వేకువజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. అమ్మవారి శీఘ్రదర్శనం కోసం ఈవో రామా రావు, అధికారులు భక్తులకు ఇబ్బంది కలగకుండా క్యూలైన్లను పర్యవేక్షించారు.



జస్టిస్ వి.గోపాలకృష్ణారావు దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు



జస్టిస్ టి.మల్లికార్జునరావు దంపతులకు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న పండితులు, అధికారులు

అమ్మవారికి కానుకగా బంగారు మంగళసూత్రాలు



మంగళసూత్రాలు అందజేస్తున్న భక్తురాలు తోట లక్ష్మి

విజయవాడ పటమటకు చెందిన తోట లక్ష్మి, కుటుంబ సభ్యులు అమ్మవారి అలంకరణ నిమిత్తం శుక్రవారం 43.5 గ్రాముల రెండు మంగళ సూత్రాలను ఆలయ ఈఈ రమాదేవి ద్వారా దేవస్థానానికి అందించారు.



దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

కనకదుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ టి.మల్లికార్జునరావు, వి.గోపాలకృష్ణారావు వారి కుటుంబసభ్యులతో వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారిని ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అధికారులు అమ్మవారి దర్శనం అనంతరం వారికి శేషవస్త్రం, ప్రసాదం, అమ్మవారి చిత్రపటం అందజేశారు. పండితులు ఆశీస్సులు అందజేశారు.

నేటి నుంచి పవిత్రోత్సవాలు

వన్‌టౌన్: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 17 నుంచి 20వతేదీ(శని, ఆది, సోమ, మంగళ) వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. దీంతో దేవస్థానంలో అన్ని ప్రత్యక్ష, పరోక్ష ఆర్జిత సేవలను నిలిపివేశారు. ఆలయంలో నిర్వహించే నిత్య కైంకర్యాలను అర్చకులు మాత్రమే నిర్వహిస్తారు. శ్రావణ శుద్ధ త్రయోదశి శనివారం సాయంత్రం 4 గంటలకు ఉదక శాంతి కార్యక్రమంతో పవిత్రోత్సవాలు ప్రారంభమవుతాయి. 18వ తేదీ వేకువజామున 3 గంటలకు సుప్రభాత సేవ నిర్వహించి అనంతరం స్నపనాభిషేకం నిర్వహిస్తారు. అనంతరం అమ్మవారికి అలంకారం చేశాక శాస్త్రోక్తంగా వేదమంత్రాల మధ్య పవిత్రమాలలను ధరింపజేస్తారు. 18వ తేదీ ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు గణపతి పూజ, మండపారాధన, అగ్ని ప్రతిష్టాపన, సర్వ ప్రాయశ్చిత విధి, వివిధ దేవతారాధనలు నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటల నుంచి మూల మంత్రహవనాలు, వేద పారాయణలు, హారతి, మంత్రపుష్పం సమర్పిస్తారు. 19వ తేదీన మండపారాధన నిర్వహిస్తారు. 20వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు మండపారాధన, సర్వప్రాయశ్చిత విధి, శాంతి పౌష్టిక హోమాలు, కూష్మాండ బలి నిర్వహించాక 10.30 గంటలకు కలశోద్వాసన, మార్జనం, మహదాశీర్వచనం కార్యక్రమాలు నిర్వహిస్తారు. 18వ తేదీన స్నపనాభిషేక కార్యక్రమం సందర్భంగా ఆరోజు ఉదయం 9 గంటల నుంచి మాత్రమే భక్తులకు అమ్మవారి దర్శనం కల్పిస్తారు.

అమ్మవారిని దర్శించుకున్న సంత్‌సదానందగిరి మహారాజ్



రుద్రప్రయాగకు చెందిన సంత్ సదానంద గిరి మహారాజ్ స్వామీజీ(108) దుర్గమ్మను దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో అధికారులు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆయనకు ఈవో కె.ఎస్.రామారావు శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

రహదారులపై భద్రతా చర్యలు చేపట్టండి

▸▸ అధికారులకు కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ ఆదేశం



మచిలీపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రహదారులపై ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో శుక్రవారం జిల్లా రహదారుల భద్రతాకమిటీ సమావేశం నిర్వహించారు. జాతీయరహదారులు 216, 65, 16, 165తోపాటు జిల్లాలోని ఇతర రహదారులపై 61ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో నివారణకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ద్విచక్రవాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్, కార్లలో ప్రయాణించేవారు సీట్‌బెల్టులు పెట్టుకునేలా అవగాహన కల్పించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కలిగే అనర్థాలను వివరించాలన్నారు. 2024 జూలై వరకు రహదారులపై జరిగిన ప్రమాదాల్లో 187మంది మరణించారని, వాటిలో జాతీయరహదారులపై జరిగిన ప్రమాదాల్లో 106 మంది ఉన్నారని అధికారులు తెలిపారు. జిల్లాలో తరచూ ప్రమాదాలు జరిగే 47బ్లాక్‌స్పాట్లను గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడుపుతున్న వారిపై రవాణాశాఖ 1,014 కేసులు, పోలీస్‌శాఖ 50,964 కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 140 నమోదుచేసి రూ.8.65 లక్షలను జరిమానాగా వసూలు చేసినట్లు తెలిపారు. జిల్లా రవాణాశాఖ అధికారి పురేంద్ర, ఏఎస్పీ ప్రసాద్, ఏపీఎస్ ఆర్టీసీ అధికారి వాణిశ్రీ, మచిలీపట్నం మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా పేరుతో ప్రజాధనం లూటీ

▸▸ గత వైసీపీ ప్రభుత్వంపై దేవినేని ఉమా ఆరోపణ

నందిగామ, ఆగస్టు 16: ఆడుదాం ఆంధ్రా పేరుతో గత వైసీపీ ప్రభుత్వం ప్రజాధనాన్ని దోపిడీ చేసిందని, అప్పటి ముఖ్యమంత్రి జగన్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు ఇందులో భాగస్వాములయ్యారని మాజీ మంత్రి, టీడీపీ ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం పేరుతో నాశిరకం ఆటవస్తువులు కొనుగోలు చేశారన్నారు. కోట్లాది రూపాయల ప్రజాధనం పక్కదారి పట్టించారని ఆరోపించారు. దీనిపై టీడీపీ కూటమి ప్రభుత్వం విచారణ చేపడుతుందని, బాధ్యులను శిక్షించి తీరుతుందని ఆయన స్పష్టంచేశారు. అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంపైనా సమగ్ర విచారణ సాగుతోందని తెలిపారు. లక్షలాది ప్రజల ఆస్తులైన నిషేధిత అగ్రిభూములను అక్రమ మార్గంలో రిజిస్ట్రేషన్ చేయించుకొని జోగి రమేష్, అతని కుమారుడు లబ్ధి పొందారని ఆరోపించారు. విచారణలో అన్ని విషయాలు వెల్లడవుతాయని, చంద్రబాబు నివాసంతో పాటు టీడీపీ కార్యాలయంపై దాడి చేసిన వారిపైనా చర్యలు తప్పవని ఉమా హెచ్చరించారు.

ఉత్సాహంగా యోగాసన పోటీలు



పోటీలో ఆసనాలు వేస్తున్న క్రీడాకాకారుడు

విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 16: కృష్ణాజిల్లా యోగాసన స్పోర్ట్సు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల 49వ యోగాసన పోటీలు అజిత్‌సింగ్‌నగర్ వివేకానంద సెంటీనరీ హైస్కూల్‌లో శుక్రవారం ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు. 8 ఏళ్ల నుంచి 45 ప్లస్ వయస్సు కలిగిన 11 కేటగిరీల్లో పోటీలు జరగ్గా 165 మంది క్రీడాకారులు బరిలో పోటాపోటీగా తలపడ్డారని జిల్లా యోగాసన స్పోర్ట్సు అసోసియేషన్ కార్యదర్శి ఎల్. మురళీకృష్ణ తెలిపారు. యోగా పోటీలకు జిల్లా ప్రెసిడెంట్ ఆర్.రవి, జాయింట్ సెక్రటరీ శాంతి రవికిరణ్, పూజిత, తేజస్వి, టి పూర్ణచంద్రరావు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

గుల్జార్‌చౌక్ మసీదులో రికార్డుల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న వక్ఫ్ బోర్డు జిల్లా అధికారులు

గుడివాడ: గుల్జార్ చౌక్ మసీదులో నిధులు దుర్వినియోగమయ్యాయని లోకాయుక్తలో వచ్చిన ఫిర్యాదు మేరకు వక్ఫ్ బోర్డు జిల్లా ఇన్‌స్పెక్టర్ ఎండీ నూహూ అలీషా శుక్రవారం రికార్డులను తనిఖీ చేశారు. గుల్జార్ చౌక్ మసీదుకు చెందిన 27 దుకాణాల అనధికార అగ్రిమెంట్లపై వచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీలు చేపట్టామని నూహూ అలీషా తెలిపారు. మసీదు కమిటీ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు కరీంబేగ్, రజాక్ బాషా, ఎండీ నూర్‌లు విలేకరులతో మాట్లాడారు. కమిటీ పూర్వ అధ్యక్షుడు షేక్ ఇబ్రహీం మసీదుకు చెందిన 27 దుకాణాలకు లీజుదారుల నుంచి రూ.12లక్షలు గుడ్‌విల్‌గా వసూలు చేశారని, వాటిని మసీదు ఖాతాలో జమచేయలేదని ఆరోపించారు. మసీదు ఖాతాలో నిధులు వివరాలను అడిగితే ఆయన తెలపలేదన్నారు. వక్ఫ్‌బోర్డు అనుమతి లేకుండా వసూలు చేసిన నిధుల విషయంలో జరిగిన అవకతవకలపై జిల్లా వక్ఫ్‌బోర్డు అధికారులకు తమ వద్ద ఉన్న సమాచారాన్ని తెలిపామని వారు స్పష్టం చేశారు. తనిఖీల్లో వక్ఫ్ బోర్డు ఉద్యోగి ఎండీ కరీముల్లా పాల్గొన్నారు.

కృష్ణానదిలో దూకి మహిళ గల్లంతు



రమ(ఫైల్)

తాడేపల్లి టౌన్, ఆగస్టు 16: కృష్ణానదిలోకి దూకి ఓ మహిళ గల్లంతైన సంఘటన తాడేపల్లి పరిధిలోని ప్రకాశం బ్యారేజి వద్ద శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా జక్కంపూడి వైఎస్సార్ కాలనీకి చెందిన రమ అనే వివాహిత కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ ఘటనకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో గల్లంతైన రమ ఆచూకీ తెలియ రాలేదని పోలీసులు తెలిపారు. వివాహిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.





వేడుకగా

విజయవాడలో అన్న క్యాంటీన్లు ప్రారంభించి అల్పాహారం రుచి చూస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కలెక్టర్ సృజన, వడ్డిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే బొండా ఉమా

అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం

పేదల కళ్లల్లో ఆనందం చూస్తున్నాం: ఎంపీ కేశినేని చిన్ని

▸▸ నిర్వహణలో లోపాలు లేకుండా చూస్తాం: కలెక్టర్ సృజన

కృష్ణలంక, ఆగస్టు 16: ఎన్టీఆర్ జిల్లాలో అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం శుక్రవారం పండుగ వాతావరణంలో జరిగింది. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో పటమట కోనేరు బసవయ్యచౌదరి జడ్పీహెచ్‌ఎస్, బుడమేరు జంక్షన్, గాంధీనగర్, వన్‌టౌన్ గాంధీ పార్కు వద్ద అన్న క్యాంటీన్లను ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించడంతో పేదల కళ్లల్లో ఆనందం కనిపిస్తోందని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. కార్యక్రమాల్లో కలెక్టర్ జి.సృజన, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, సుజనాచౌదరి, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. రూ.5కే అల్పాహారాన్ని స్వయంగా వడ్డించారు.

దేవినేని ఉమాపై చెరగని అభిమానం

▸▸ నందిగామ అన్న క్యాంటీన్ వద్ద చూసి అభిమానుల కన్నీటి పర్యంతం..ఉమాకు పదవి ఇవ్వాలంటూ నినాదాలు



నినాదాలు చేస్తున్న అభిమానులు

నందిగామ: టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి నందిగామలో ప్రజల మధ్యకు వచ్చిన మాజీ మంత్రి దేవినేని ఉమాపై ఆయన అభిమానులు చెరగని అభిమానాన్ని చూపారు. పట్టణంలో శుక్రవారం ప్రారంభమైన అన్న క్యాంటీన్ సందర్శనకు వచ్చిన ఉమా అక్కడ ప్రజలతో మాట్లాడుతుండగా కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వడ్డెల్లి సాంబశివరావుతో పాటు అక్కడ ఉన్న ఉమా అభిమానులు, ప్రజలు ఆయన్ను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. పార్టీ కోసం, ప్రజల కోసం కష్టపడే మీవంటి నాయకుడికి సీటు దక్కకపోవడం దారుణమంటూ కంటతడి పెట్టారు. ఏ సమస్య వచ్చినా మీరున్నారన్న ధైర్యంతో ఉండేవారమంటూ వేదన చెందారు. అందరికీ అందుబాటులో ఉండే మీవంటి నేతకు ఇలా జరగడమేమిటంటూ ఆయన చుట్టూచేరారు. మీకు న్యాయం జరగకపోతే నిబద్ధత అన్న పదానికి అర్థం లేదన్నారు. చంద్రబాబు తక్షణమే ఉమా కష్టానికి తగిన పదవిని ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. దీంతో ఉమా సైతం ఉద్విగ్నానికి లోనయ్యారు. వడ్డెల్లితో పాటు ఇతర అభిమానులను ఆయన సముదాయించారు. పదవులు ముఖ్యం కాదని, చంద్రబాబు పాలనలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు అందరం కలసి పని చేద్దామని వారికి ఉమా సూచించారు.

ఎన్టీఆర్ జిల్లాలో 14 క్యాంటీన్లు: కలెక్టర్ సృజన

ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 14 అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తున్నామని కలెక్టర్ సృజన తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో 11 క్యాంటీన్లను ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. క్యాంటీన్లలో మెనూ ప్రకారం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం ఏర్పాటు చేస్తున్నామని, స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశామని తెలిపారు. నిర్వహణలో లోపాలు లేకుండా, ఎలాంటి ఇబ్బంది రాకుండా చూస్తామన్నారు.

బృహత్తర కార్యక్రమం: ఎమ్మెల్యేలు గద్దె, బొండా, సుజనా చౌదరి

రోజుకు 15 రూపాయల చొప్పున నెలకు రూ.450తో పేదల ఆకలిని తీర్చే బృహత్తర కార్యక్రమమని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ప్రజల భాగస్వామ్యంతో కలకాలం అన్న క్యాంటీన్లు కొనసాగుతాయని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా పేర్కొన్నారు. అన్న క్యాంటీన్ల నిర్వహణకు విరాళాలు ఇచ్చేందుకు చాలా మంది ముందుకొస్తున్నారని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి తెలిపారు. ఇది ఓ గొప్ప స్ఫూర్తికి తార్కాణమన్నారు. క్యాంటీన్లలో అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్లు డాక్టర్ ఎ.మహేష్, కేవీ సత్యవతి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

జగన్‌రెడ్డిది సంకుచిత, శాడిస్ట్ మనస్తత్వం

▸▸ అన్న క్యాంటీన్లు నిలిపివేసి పేదలపై కక్ష తీర్చుకున్నాడు

▸▸ పేటలో అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవంలో నెట్టెం, తాతయ్య

జగ్గయ్యపేట: "వైసీపీ అధ్యక్షుడు, పులివెందుల ఎమ్మెల్యే జగన్‌రెడ్డి సంకుచిత, పైశాచిక మనస్తత్వంతో అన్న క్యాంటీన్లు నిలిపివేశారు. పేదలపై కక్ష తీర్చుకున్న ఘనుడాయన." అని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య విమర్శించారు. శుక్రవారం జగ్గయ్యపేటలో వారు అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. తొలి రోజు మొత్తం ఖర్చును నెట్టెం రఘురాం అందజేసి, ఉచితంగా ఆహారం అందించారు. మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కన్నెబోయిన రామలక్ష్మి, నెట్టెం శివరాం, శ్రీరాం చినబాబు పాల్గొన్నారు.



జగ్గయ్యపేటలో టిఫిన్ చేస్తున్న నెట్టెం రఘురాం, శ్రీరాం తాతయ్య

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లు

▸▸ నిర్వహణ కోసం కృష్ణాజిల్లాలో ఏడుగురు ఎమ్మెల్యేలు, ఎంపీ కలిసి రూ.50 లక్షల విరాళమిస్తాం: కొల్లు రవీంద్ర



రూ.లక్ష చెక్కును మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరికి అందజేస్తున్న డాక్టర్ బి.ధన్వంతరీ ఆచార్య

మచిలీపట్నం టౌన్: పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లు మళ్లీ ప్రారంభిస్తున్నామని వాటి నిర్వహణ కోసం కృష్ణాజిల్లాలోని ఏడుగురు ఎమ్మెల్యేలు, ఎంపీతో కలిసి రూ.50 లక్షలు విరాళంగా అందజేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మచిలీపట్నం మూడు స్తంభాల సెంటర్‌లో అన్న కాంటీన్‌ను ఎంపీ వల్లభనేని బాలశౌరితో కలిసి ఆయన ప్రారంభించారు. పేదలకు టిఫిన్ వడ్డించారు. వారితో కలిసి మంత్రి పూరీలు తిన్నారు. జగన్ సీఎం అయ్యాక అన్న కాంటీన్లు రద్దు చేశారని, పేదలకు ఉపయోగపడే కార్యక్రమాలను రద్దు చేస్తే చరిత్ర హీనులుగా మిగిలిపోతారని కొల్లు రవీంద్ర హెచ్చరించారు. పేదలు హోటల్‌కు వెళ్లి భోజనం చేయాలంటే రూ.80 నుంచి రూ.100 ఖర్చవుతోందని, సీఎం చంద్రబాబు, ఉపముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ పేదల కడుపు నింపేందుకు అన్న క్యాంటీన్లు పునఃప్రారంభిస్తున్నారని ఎంపీ వల్లభనేని బాలశౌరి తెలిపారు. మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, అక్షయపాత్ర సమన్వయ కర్త ఆషిబాబు, బాబా ప్రసాద్, మాదివాడ రాము, గోపాల్ పాల్గొన్నారు.

రూ.2 లక్షల విరాళం

మచిలీపట్నానికి చెందిన వైద్యుడు బి.ధన్వంతరీఆచార్య అన్న క్యాంటీన్ నిర్వహణకు ఏటా ఆగస్టు 15న రూ.లక్ష ఇస్తామన్నారు. రూ.లక్ష చెక్కును మంత్రికి అందించారు. తన కుమారుడు ఆశ్రిత్ తొలి జీతం రూ.లక్ష చెక్కును జనసేన నాయకుడు మాదివాడ రాము అందజేశారు.

అన్నార్తులకు వరం

ఆకలితో ఉండే తమకు పునఃప్రారంభించిన అన్న క్యాంటీన్లు ఓ వరమని పలువురు కార్మికులు, పేదలు పేర్కొన్నారు. ప్రారంభమైన తొలిరోజే కార్మికులు, పేదలు భారీగా తరలివచ్చారు.

రూ.5కే భోజనం సంతోషకరం



చల్లపల్లి నుంచి మచిలీపట్నం వచ్చి ఉల్లిపాయలు అమ్ముకుంటా. హోటల్ భోజనానికి రూ.100 ఖర్చవుతోంది. బైక్‌పై రానూ పోనూ బందరులో తిరిగేందుకు రోజుకు రూ.160 ఖర్చవుతోంది. నాకు ముగ్గురు ఆడ పిల్లలు. వారిని పోషించుకోవాలి. అన్న క్యాంటీన్‌లో రూ.5కే భోజనం పెడుతున్నారు. ఎంతో సంతోషంగా ఉంది. **-పరసు జగన్మోహనరావు, చల్లపల్లి**

భోజనం రుచిగా ఉంది



బందరు బలరామునిపేటలో ఉంటాను. గ్యాస్ ప్రమాదం వల్ల రెండు కాళ్లు దెబ్బతిన్నాయి. ఇంట్లో పనిచేసుకోవడం కష్టంగా ఉంది. నా భర్త చనిపోయాడు. టైలరింగ్ చేసుకుని బతికే నాకు రూ.5కే మూడు పూటలా ఆహారం దొరుకుతుంది. భోజనం రుచిగా ఉంది. సాంబారు బాగుంది. పెరుగు, నిమ్మకాయ పచ్చడి వేశారు.

- పాగోలు వెంకట సత్యవతి, బలరామునిపేట



చంద్రబాబు రుణం తీర్చుకోలేం

బందరు మండలం వాడగొయ్యి నుంచి వచ్చి ఇక్కడ ఆటో నడుపుతుంటా. రోజుకు రూ. 500 సంపాదిస్తా. టిఫిన్లు, భోజనానికి రూ.300 అయిపోతాయి. అన్న క్యాంటీన్‌తో నా ఖర్చు భారీగా తగ్గుతుంది. నాలాంటి పేద, మధ్యతరగతి ప్రజలకు భోజన సౌకర్యం కల్పించిన చంద్రబాబు రుణం తీర్చుకోలేం.

- గోసాల బాలకోటేశ్వరరావు, వాడగొయ్యి

వైద్యులపై దాడులు అరికట్టాలి

ఐజీఎం స్టేడియంలో ఐఎంఏ ప్రతినిధులు, జూడాలు, వైద్య విద్యార్థుల నిరసన ప్రదర్శన

లబ్బీపేట, ఆగస్టు 16: దేశవ్యాప్తంగా మహిళలు, వైద్యులు, మహిళా వైద్యులపై దాడులను అరికట్టేందుకు తక్షణ శిక్ష అమలయ్యేలా ప్రత్యేక చట్టాలు తేవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ), ఏపీ జూడా, డాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కళాశాలలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం ఘటనను నిరసిస్తూ శుక్రవారం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిరసన కార్యక్రమం, కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కోల్‌కతా ఘటన సభ్యసమాజం తలదించుకునే దురదృష్టకర ఘటన అని, మహిళా వైద్యురాలపై హత్యాచారం అమానుషమని వైద్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. డాక్టర్లు, మహిళా డాక్టర్లపై దాడులు అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. హత్యాచార ఘటనలో నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నల్లదుస్తులు ధరించి వైద్య విద్యార్థినులు, జూడాలు, భారీ కొవ్వొత్తుల ప్రదర్శనతో పాటు, స్టేడియం ముందు బందరురోడ్డులో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఐఎంఏ ప్రతినిధులు, జూడాలు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ముంబైకి ఇండిగో సర్వీసు పునఃప్రారంభం

గన్నవరం, ఆగస్టు 16: గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ముంబైకి ఇండిగో విమానం పునఃప్రారంభం అయింది. ప్రతి రోజు రాత్రి 9 గంటలకు ఇక్కడి నుంచి ముంబైకి బయలుదేరుతుంది. ఇందులో 106 మంది ప్రయాణికులు ముంబై వెళ్లారు. ఎంపీలు వల్లభనేని బాలశౌరి, కేశినేని చిన్నిల అభ్యర్థన మేరకు ఇండిగో విమాన సంస్థ ముంబైకి మళ్లీ సర్వీసును ప్రారంభించింది. ముంబైకి వెళ్లే ప్రయాణికులకు సర్వీసును అందుబాటులో ఉంచటమే లక్ష్యమని ఎంపీలు తెలిపారు. ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, కొలికపూడి శ్రీనివాసరావు, ఎయిర్‌పోర్టు అధికారులు పాల్గొన్నారు.



ప్రయాణికులకు బోర్డింగ్ పాస్ అందజేస్తున్న ఎంపీలు వల్లభనేని బాలశౌరి, కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, కొలికపూడి శ్రీనివాసరావు

మల్లవల్లికి మహర్దశ

(మూడో పేజీ తరువాయి)

పరిశ్రమలు సైతం వెనుదిరిగాయి. దీంతో ఆయా స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి చిట్టడివిలా మారిపోయింది.

మళ్లీ చిగురించిన ఆశలు..

ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మల్లవల్లి పారిశ్రామివాడ అభివృద్ధిపై ఆశలు చిగురించాయి. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ సూచనలతో స్థానిక గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మల్లవల్లిలో భూములు పొందిన పారిశ్రామికవేత్తలతో పలుమార్లు సమావేశమయ్యారు. ఇప్పటికే పనులన్నీ పూర్తి చేసుకుని ప్రారంభానికి నోచుకోని అశోక్‌లేలాండ్ సంస్థ పునఃప్రారంభం కోసం ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. పలుమార్లు సంస్థ ప్రతినిధులతో భేటీ అయ్యారు. 75 ఎకరాల్లో రూ.140 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ సంస్థ అందుబాటులోకి వస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్న ఉద్దేశంతో వెంకట్రావు అశోక్ లేలాండ్ ప్రారంభానికి తీవ్రంగా కృషి చేశారు. అశోక్‌లేలాండ్ సంస్థ తొలుత ఇక్కడ బస్సు బాడీ బిల్డింగ్ యూనిట్‌ని ప్రారంభించనుంది. అనంతరం ట్రైనింగ్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేస్తుంది. ఇవన్నీ గాడిన పడిన తర్వాత ప్లాంటు విస్తరణలో భాగంగా బస్సు అసెంబ్లింగ్ యూనిట్‌ను ప్రారంభించనుంది. ఈ సంస్థ ఏర్పాటు ద్వారా 500 మందికి ప్రత్యక్షంగా మరో 5వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది.

నిర్లక్ష్యం ఆవరించి..

(మూడో పేజీ తరువాయి)

సాగునీరు అందకున్నా, వర్షం కూడా కురవకున్నా వరిపైరు చనిపోతుందని రైతులు అంటున్నారు. ఇప్పటికే నాట్లువేసి నెలరోజులు పైగా అయ్యిందని, ఈదశలో మొదటి విడతగా పైరుకు ఎరువులు వేయాలని, సాగునీరు రాకపోవడంతో ఎరువులు వేయలేకపోతున్నామని అంటున్నారు.

● **కాలువలను పూడ్చడంతో ఆగిన సాగునీరు**

గుడివాడ పట్టణం ప్రారంభంలో పామర్రు కాలువ పక్కనే రైల్వే ఫ్లైఓవర్‌కు అప్రోచ్ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా మట్టిని తవ్వారు. ఈ సమయంలో శేరివేల్పూరు తదితర గ్రామాలకు సాగునీటిని సరఫరా చేసే పామర్రు కాలువలో మట్టిని వేశారు. దీంతో దిగువ ప్రాంతాలకు సాగునీటి విడుదల దాదాపు నిలిచిపోయింది. దుబ్బు చేసే దశలో ఉన్న పంట పొలాలు 15 రోజులకు పైబడి సాగునీరు లేక ఎండిపోతున్నాయని రైతులు అంటున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	101, 110, 121
చికెన్ విత్ స్కిన్	196
చికెన్ స్కిన్‌లెస్	206



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.91

ప్రతీ ఇంటికీ కుళాయి ప్రభుత్వ లక్ష్యం

● తాడిగడప మునిసిపాలిటీ పరిధిలో మూడు రోజుల పాటు సర్వే

పెనమలూరు, ఆగస్టు 16 : ప్రతీ ఇంటికీ కుళాయి అందించాలనే ప్రభుత్వ లక్ష్యం కారణంగా తాడిగడప మునిసిపాలిటీ పరిధిలోని నాలుగు సర్కిళ్లలో ఈ నెల 18 వరకు మూడు రోజులపాటు అధికారులు ఇంటింటి సర్వే చేయనున్నట్లు మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. డ్రింకింగ్ వాటర్ సర్వే అనాలసిస్‌కు వచ్చే అధికారులకు స్థానికులు సహకరించాలని కోరారు. ప్రభుత్వం ప్రతీ ఇంటికీ తాగునీరు అందించాలనే సంకల్పంతో ఉందని, అందుకు అనుగుణంగా స్థానికులు అధికారులకు వివరాలు అందజేయాలని ఆయన కోరారు.





పేదల ఆకలి తీర్చడమే లక్ష్యం

ఉయ్యూరులో అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవంలో ఎంపీ బాలశౌరి

ఉయ్యూరు, ఆగస్టు 16 : పేదల ఆకలి తీర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, పేదలకు మూడుపూటలా అన్నం పెట్టాలన్న ఉద్దేశంతో ఐదేళ్ల క్రితం అమలు చేసిన అన్న క్యాంటీన్‌లకు వైసీపీ ప్రభుత్వం మంగళం పాడి పేదల నోటి కాడ కూడు తీసి వారి ఉసురుకట్టుకుందని ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. ఉయ్యూరు శివాలయం రోడ్డులో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదల ఆకలి తీర్చాలన్న మహోన్నత లక్ష్యంతో తెలుగుదేశం ప్రభుత్వం అన్న క్యాంటీన్‌లు ప్రారంభిస్తే తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ వాటిని మూసివేసి పేదల పొట్టకొట్టిందని దుయ్యబట్టారు పెనమలూరు నియోజకవర్గంలో మరో మూడు నాలుగు క్యాంటీన్‌లు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు.



ఉయ్యూరులో అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలిసి ప్రారంభిస్తున్న ఎంపీ బాలశౌరి

పేద వారి ఆకలి తీర్చే అన్న క్యాంటీన్‌లు కొనసాగిస్తే చంద్రబాబు నాయుడుకు ఎక్కడ పేరువస్తుందో అనే దురు ద్దేశంతో వైసీపీ ప్రభుత్వం మూసివేసి దారుణానికి వడికట్టిందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆరోపించారు. ఉయ్యూరులో కార్మికులు, భవన నిర్మాణ, రిక్షా కార్మికులు, కూలీపనులు చేసుకునేవారికి అన్న క్యాంటీన్ ఎంతో ఉపయో గపడుతుందన్నారు. ఉయ్యూరులో మూసివేసిన అన్న క్యాంటీన్‌ను తిరిగి ఎంపీతో కలసి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. రూ. 15కు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం పెట్టి పేద ప్రజల ఆకలి తీర్చడం కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. ఉయ్యూరు ఛైర్మన్ వి.సత్యనారాయణ, మాజీ ఛైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు, వార్డు కౌన్సిలర్ పి.శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు జయదేవ్, బుల్లెట్ బాబి, చిరంజీవి, రఫీ, ప్రభాకర్‌రావు, వి.శంకరబాబు, తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి, జనసేన నాయకుడు ముప్పా రాజ, కమిషనర్ పి. వెంకటేశ్వరరావు, తహసీల్దార్ ఎం. సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అడుసుమిల్లి పద్మకుమారిని పరామర్శిస్తున్న నారా భువనేశ్వరి

బంధువుకు సీఎం సతీమణి పరామర్శ

పెనమలూరు, ఆగస్టు 16 : కానూరు పప్పుల మిల్లు వద్ద నివాసముంటూ కొద్దిపాటి అనారోగ్యంతో బాధపడుతున్న బంధువు అడుసుమిల్లి పద్మకుమారిని సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి శుక్రవారం పరామర్శించారు. ఆమె యోగక్షేమాలను అడిగి తెలుసుకొన్నారు. అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. భువనేశ్వరితో పాటు స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, అనంతనేని ఆజాద్, ఇతర నాయకులు ఉన్నారు.

ఉపాధి కోర్సుల్లో యువతకు శిక్షణ

ఉంగుటూరు, ఆగస్టు 16 : కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధికల్పించే పలుకోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి ఉచిత శిక్షణా కేంద్రం (యూబీఆర్‌ఎస్‌ఈటీఐ) డైరెక్టర్ పి.మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్‌లోని యూబీఆర్‌ఎస్‌ఈటీఐ కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి కృష్ణాజిల్లాల్లోని యువతకు ఆసక్తి వున్న రంగాల్లో నైపుణ్యాలు మెరుగు పరచి స్వయం ఉపాధి కల్పించాలనే ప్రధాన లక్ష్యంతో యూబీఆర్‌ఎస్‌ఈటీఐ, జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్, స్వర్ణభారత్‌ట్రస్ట్, భారతప్రభుత్వ గ్రామీణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ తరగతులు నిరంతరంగా నిర్వహిస్తున్నామన్నారు. వివరాలకు 6304254730, 9951920120, 6302171225 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

కానో కార్పస్ మొక్కలను నివారించండి

పెనమలూరు, ఆగస్టు 16 : పర్యావరణానికి హాని చేసే కోనో కార్పస్ మొక్కలను నివారించేలా చర్యలు తీసుకోవాలని దళిత నాయకులు కొసనం రాము తాడిగడప మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావుకు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ మొక్కలు భూగర్భంలో నీటి ఉపరితలాన్ని తగ్గించడమే కాకుండా మనుషుల్లో క్యాన్సర్ రావడానికి కారకం కూడా అవుతాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. రోడ్ల మధ్య డివైడరుపై విచ్చలవిడిగా నాటిన మొక్కలను నివారించాలని కోరారు. ఆయన వెంట జనసేన నాయకులు చెన్నా గాంధీ ఉన్నారు.

అనాథ శరణాలయానికి సరుకుల వితరణ

పెనమలూరు, ఆగస్టు 16 : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా యూనియన్ బ్యాంకు ఉద్యోగులు, మాజీ సైనికులు పోరంకిలోని అనాథ శరణాలయంలో ఉన్న విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. షుమారు పదిహేను విలువైన నిత్యావసరాలను శరణాలయానికి వితరణ గావించారు. లైక్ మైండెడ్‌గా పిలువబడే ఈ గ్రూపు సభ్యులు వీ శ్రీనివాస్, టీవీజీ మూర్తి, జీ ప్రసాద్, శివరామకృష్ణ, ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ, ప్రతి ఏడాది తాము తమ గ్రూప్ తరపున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉంగుటూరు, ఆగస్టు 16 : ఉంగుటూరు విద్యుత్ ఉపకేంద్రంలో నెలవారీ మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సబ్‌స్టేషన్ ఏఈ ఏ.సూర్యప్రకాష్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఆముదాలపల్లి. కొయ్యగూరపాడు, లంకపల్లి, ముక్కపాడు, ఓంధ్రంపాడు, ఉంగుటూరు, పొణుకుమాడు, గారపాడు, ఎలుకపాడు, నాగవరప్పాడు, వెల్దిపాడు, వెన్నూతల, తుట్టగుంట, వేంపాడు, తరిగొప్పల, చాగంటిపాడు గ్రామాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆయా గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

పెనమలూరు, ఆగస్టు 16 : గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చేతుల మీదుగా యనమలకుదురులో ప్రారంభించిన ఎన్టీఆర్ సుజల పథకం వాటర్ ప్లాంటును శుక్రవారం మళ్లీ తిరిగి ప్రారంభించారు. ఈ వాటర్ ప్లాంటు వైసీపీ ప్రభుత్వ పాలనలో మూత పడింది. దీంతో యనమలకుదురు ప్రజలు తాగు నీటికి ఇబ్బంది పడుతున్నారు. పరిస్థితిని గమనించిన టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు తన తల్లి దండ్రులు వెలగపూడి వెంకటేశ్వరరావు, త్రిపురాంబల జ్ఞాపకార్థం రెండు లక్షల రూపాయలతో ప్లాంటును ఆధునికీకరించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. శంకరబాబు సేవాభావాన్ని ఎమ్మెల్యే బోడె ప్రసాద్, స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి బాబూరావు, వల్లూరు అన్నపూర్ణ, మల్లంపాటి విజయలక్ష్మి, పండల రజిని, రంగారావు, ఆజాద్, సుంకర సాయి, రమేష్, వెలగపూడి శేఖర్, నాగూర్, వీరాస్వామి, ఇమాం, రఫీ తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు గౌతు లచ్చన్న

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, ఆగస్టు 16 : స్వాతంత్ర్య సమరయోధుడు, బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న చిరస్మరణీయుడని స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. శుక్రవారం గౌతు లచ్చన్న 115వ జయంతి సందర్భంగా యనమలకుదురులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే నివాళులర్పించారు. స్థానిక టీడీపీ బీసీ నాయకుడు శొంఠి శివరాంప్రసాద్ నేతృత్వంలో ఏర్పాటు చేయ తలపెట్టిన గౌతు లచ్చన్న విగ్రహ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా శొంఠి మాట్లాడుతూ, దివంగత గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటు చేయడానికి అవకాశం రావడం తన అదృష్టమన్నారు. జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా రైతు ఉద్యమాలు నడిపిన ఉద్యమకారుడిగా, రాజకీయనాయకుడిగా గౌతు లచ్చన్న సాగించిన ప్రయాణం ఆయనను మహనీయునిగా నిలబెట్టిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, వీరంకి వెంకట గురుమూర్తి, బెజవాడ శివయ్య, మరీదు వెంకటేశ్వరావు, పరస వెంకటస్వామి, లుక్కా అరుణ్‌బాబు, ఆరేపల్లి ఈశ్వరరావు, ఆరేపల్లి దాసు, మల్లంపాటి విజయలక్ష్మి, సింహాద్రి కృష్ణవేణి, వణుకూరు విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



గౌతు లచ్చన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్



గౌతు లచ్చన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్

ఉయ్యూరు : అణగారిన వర్గాల ఆశాజ్యోతిగా, ఉద్యమకారుడు, రాజకీయ నాయకుడుగా సర్దార్ గౌతు లచ్చన్న సాగించిన ప్రయాణం ఆయనను మహనీ యునిగా నిలబెట్టిందని మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ కొనియాడారు. గౌతు లచ్చన్న 115వ జయంతి పురస్కరించుకుని టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి రాజులపాటి ఫణి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన చిత్రపటానికి పూల మాలవేసి ఘనంగా నివాళులర్పించారు. దేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తరువాత సర్దార్ అనే గౌరవం పొందిన ఏకైక వ్యక్తి లచ్చన అని కీర్తించారు. టీడీపీ మండల అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, పలువురు కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ● టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లచ్చన చిత్రపటానికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పూలమాలవేసి నివాళులర్పించారు. గుర్నాధరావు, వత్సవాయి ఏడుకొండలు, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు. ● స్థానిక ప్రధాన సెంటర్‌లో సర్దార్ గౌతు లచ్చ న్న సేవాసమితి అధ్యక్షుడు కాగిత కొండ ఆధ్వర్యంలో జరిగిన లచ్చన్న జయంతి కార్యక్రమంలో బోడె ప్రసాద్, ఉయ్యూరు ఛైర్మన్ వి. సత్యనారాయణ, మాజీ ఛైర్మన్ పూర్ణచంద్రరావు లచ్చన్న చిత్రటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. కుటుంబరావు, శివ, కొండలు, పడమట వెంకటేశ్వరరావు, శ్రీనివాస ప్రసాద్ తదితరులు నివాళులర్పించారు.

తిరుపతమ్మ ఆలయంలో వైభవంగా సంబరాలు

గన్నవరం, ఆగస్టు 16 : పాత గన్నవరంలోని లక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో శ్రావణ మాసం రెండవ శుక్రవారం సందర్భంగా సంబరాలను వైభవంగా జరిపారు. తెల్లవారు ఝాము నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రాంగణంలోని మానుకు పూజలు చేసి పొంగళ్లు సమర్పించారు. లక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్య స్వామిని పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకట బాలవర్ధనరావు, సీఐ శివప్రసాద్, ఎస్సై కనక దుర్గ, సర్పంచ్ నిడమర్తి సౌజన్య దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, తిరుపతమ్మ తల్లి ఆశీస్సులు అందరిపైన ఉండాలని ఆకాంక్షించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ ఏర్పాటు చేశారు. శ్రీసత్యసాయి సేవా సమితి వాలంటీర్‌లచే భక్తులకు తాగునీరు, ప్రసాద వితరణ జరిపారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం జరిపారు.

కోలాహలంగా ప్రభ బండ్లు

పాత గన్నవరం తిరుపతమ్మ ఉత్సవాల సందర్భంగా ప్రభ బండ్ల ఊరేగింపు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక చెంచుల కాలనీలో యువ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రభ బండిని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. చిమట గంగాధర్, చిమట రవివర్మ, గోపి, పిన్నిబోయిన రమేష్, చెన్ను బాబి, తుల్లిమిల్లి గోపి తదితర నాయకులు పాల్గొన్నారు. కొత్తపేటలో ప్రభను చిమట గంగాధర్ ప్రారంభించగా సభ్యులు తాడిశెట్టి నరేష్, శ్రీనివాసరావు, దుర్గా ప్రసాద్, రంగారావు, వెంకన్న బాబు పాల్గొన్నారు. సొసైటీ పేట, చింతలపేట, యాద వుల పేట, గౌడపేట తదితర ప్రాంతాల్లోని ప్రభ బండ్లు ఊరేగింపు నిర్వహించారు. తీన్‌మార్ డప్పులు కొలాట, నృత్య ప్రదర్శనలు, డీజే సాంగ్స్‌తో యువ కుల మధ్య కోలాహలంగా ప్రదర్శన సాగింది.



ప్రభ ఊరేగింపు



తిరుపతమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

అమ్మవారి ఆలయాల్లో శ్రావణ శోభ

ఉంగుటూరు : శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పలు అమ్మవారి ఆలయాలు శ్రావణ శోభను సంతరించుకున్నాయి. శ్రావణ శుక్ల పౌర్ణమికి ముందు వచ్చే రెండో శ్రావణ శుక్రవారం కావటంతో తెల్లవారుజామునుంచే ఆయా ఆలయాల్లో అమ్మవార్ల దర్శనానికి భక్తులు క్యూ కట్టారు. సౌభాగ్యాన్ని ప్రసాదించే వరలక్ష్మీదేవి వ్రతాన్ని మహిళలు సంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని ఆత్కూరు శ్రీకనకదుర్గమ్మ, పొణుకుమాడు శ్రీరాజరాజేశ్వరి, తరిగొప్పల శ్రీదుర్గాదేవి, ఇందుపల్లి శ్రీపార్వతీదేవి,. తేలప్రోలు శ్రీరంగమ్మ పేరంటాలు అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

లక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన ఆత్కూరు కనకదుర్గమ్మ

జాతీయ రహదారి పక్కన ఆత్కూరులోని కనకదుర్గమ్మ దేవస్థానంలో అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. 100, 500రూ.ల కరెన్సీనోట్లు, నిమ్మకాయల దండలతో లక్ష్మీదేవిగా అలంకరించిన అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో మహిళాభక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చనలతో పాటు, పసుపు, కుంకుమలు, పూలు,పండ్లు, గాజులతో ప్రత్యేకపూజలు నిర్వహించి పొంగళ్లు సమర్పించారు. ఆలయ కమిటీ పెద్దలు కృష్ణప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కరెన్సీనోట్ల దండలతో లక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిస్తున్న కనకదుర్గమ్మ



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	101, 110, 121
చికెన్ విత్ స్కిన్	196
చికెన్ స్కిన్‌లెస్	206

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.91



బాల త్రిపుర సుందరీదేవికి బంగారు కాసులపేరు, జడ

కూచిపూడి, ఆగస్టు 16 : కూచిపూడి బాల త్రిపుర సుందరిదేవికి ప్రవాస భారతీయులు శ్రీచరణ్ పొలదుగు లక్ష రూపాయల విలువ గల కాసుల పేరు, జడను సమర్పించారు. పాలకమండలి కార్యదర్శి రూ.12 వేల విలువ గల దండను సమర్పించారు. ఆలయ అర్చకులు పెనుమూడి సతీష్ కుమార్ శర్మ, పెనుమూడి పూర్ణ చంద్రశేఖర శర్మలకు వీటిని అందించారు. పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

భీమనది చానల్ చివరి భూములకు సాగునీరందిస్తాం

ఘంటసాల, ఆగస్టు 16 : భీమనది చానల్ చివరి భూములకు ఎగువ ప్రాంత రైతుల సహకారంతో సాగునీరు అం దిస్తామని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఘంటసాల, చల్లపల్లి మండలాల పరిధిలోని దాలిపర్రు, మాజేరు గ్రామాల వద్ద పంట కాల్వలను అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. రైతులందరికీ సాగునీరు అందించి వ్యవసాయ పనులు పూర్తి చేసుకునేందుకు సహకారం అందిస్తామన్నారు. సాగునీరు దిగువ ప్రాంతాలకు సరఫరా అయ్యేలా రైతులతో కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. గుండేరు డ్రెయిన్‌పై



గుండేరు నీటి లిఫ్ట్‌ను పరిశీలిస్తున్న మండలి, అధికారులు

మరిన్ని లిఫ్ట్ ఇరిగేషన్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, ఇరిగేషన్ డీఈలు మురళీకృష్ణ, రావెళ్ల రవికిరణ్, డీఈఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, ఏఈఈలు డి.ప్రసాద్, కె.సత్యనారాయణ, మండల టీడీపీ అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, నాయకులు మిక్కిలినేని మధు, పరిశె చలపతి, దాలిపర్రు సర్పంచ్ డొకిపర్తి శాంత కుమారి, ఈవో పుట్టి రాంబాబు పాల్గొన్నారు.

ఇరిగేషన్ ప్రత్యేక దృష్టి సారించాలి

చల్లపల్లి : చివరి భూముల్లో సాగునీటి సమస్య పరిష్కారమై రైతుల ఇబ్బందులు తీరేదాకా ఇరిగేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిందేనని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. కొత్తమాజేరులో 9/2 కాలువను ఎమ్మెల్యే పరిశీలించారు. రైతుల సమస్యలు పరిష్కారానికి అధికారులు ప్రణాళికాయుతంగా కృషిచేయాలన్నారు. ఇరిగేషన్ డీఈ రావెళ్ల రవికిరణ్, డ్రైనేజీ డీఈ పి.వెంకటేశ్వరరావు, ఏఈ జనార్దన్, స్థానిక నేతలు బొర్రా అగ్గిరాముడు, తుమ్మలగుంట గోపాలకృష్ణ, కాగిత ధర్మారావు, కమ్మిలి పెదబాబు తదితరులు పాల్గొన్నారు.




పెడనలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించి భోజనం పెడుతున్న బాలశౌరి, కాగిత, కొనకళ్ల



గుడివాడలో అన్న క్యాంటీన్ ప్రారంభిస్తున్న రావి



బందరులో భోజనం వడ్డిస్తున్న కొల్లు నీలిమ

అన్నార్తుల కోసమే అన్న క్యాంటీన్లు

పెడన, ఆగస్టు 16 : అన్నార్తుల కడుపు నింపేందుకే అన్న క్యాంటీన్లు అని, వీటి నిర్వహణకు దాతలు విరాళాలు ఇవ్వాలని ఎంపీ వల్లభనేని బాలశౌరి పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావుతో కలిసి బస్టాండ్ సెంటర్‌లో అన్న క్యాంటీన్‌ను బాలశౌరి పునఃప్రారంభించారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సూచన మేరకు డొక్కా సీతమ్మ క్యాంటీన్లను కూడా త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదల కడుపు నింపే అన్న క్యాంటీన్లను ప్రారంభించడం జరిగిందన్నారు. బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు మాట్లాడుతూ, చేనేత, ఆటో, భవన నిర్మాణ, వ్యవసాయ కార్మికులకు అన్న క్యాంటీన్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కృత్తివెన్ను మండలం లక్ష్మీపురానికి చెందిన రాపూరి తాతాజీ అన్న క్యాంటీన్‌కు రూ.10 వేలు విరాళంగా అందించారు. కమిషనర్ బి. వెంకట్రామయ్య, శ్యామలయ్య, బండి రామకృష్ణ, వహబ్‌ఖాన్, పంచకర్ల సురేష్, అర్జా వెంకట నగేష్, శలపాటి ప్రసాద్, కమ్మగంటి బాబు, హవీదుల్లా, కొండలరావు, వడుగు తులసీరావు, బీరం ప్రసాద్, మామిడి లక్ష్మీనారాయణ గుప్తా, బొల్లా కాశీ పాల్గొన్నారు. **గుడివాడ** : దాతలు అన్న క్యాంటీన్ల నిర్వహణకు విరాళాలివ్వాలని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఏజేకే మున్సిపల్ ఉన్నత పాఠశాల పక్కనే అన్న క్యాంటీన్‌ను ఆయన పునఃప్రారంభించి అల్పాహారం వడ్డించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ల బులయ్య, మున్సిపల్ కమిషనర్ జి.బాల సుబ్రహ్మణ్యం, యలవర్తి శ్రీనివాసరావు, శ్రీకాంత్, మున్సిపల్ డీఈ ప్రవీణ్, సతీష్, డా.గోర్జి సత్యనారాయణ, లింగం ప్రసాద్, పోలాసి ఉమా, కంచర్ల సుధాకర్, కృష్ణారావు పాల్గొన్నారు.

అన్నం పెట్టడంలో ఎంతో నందం

మచిలీపట్నం టౌన్ : పేదలకు అన్నం పెట్టడంలో ఎంతో ఆనందం ఉంటుందని మంత్రి రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ అన్నారు. మూడు స్తంభాల సెంటర్‌లో నూతనం గా ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లో శుక్రవారం కొల్లు నీలిమ భోజనం వడ్డించారు. తన తండ్రి నడకుదిటి నరసింహారావు ఇచ్చిన స్థలం అమ్మి నాలుగేళ్ళ పాటు పేదలకు కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం , రాగి జావ పంపిణీ చేశామన్నారు. పేదల కష్టాలు తెలిసిన సీఎం చంద్రబాబు అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లు పునః ప్రారంభించారన్నారు. మచిలీపట్నంలో జ్యూయలరీ పార్కు వద్ద, బస్టాండు వద్ద మరో రెండు అన్న కాంటీన్లు ప్రారంభిస్తామన్నారు. మోటమర్రి బాబా ప్రసాద్, మచిలీపట్నం మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడరు పల్లపాటి సుబ్రహ్మణ్యం, గనిపిశెట్టి గోపాల్, లంకిశెట్టి నీరజ, పాలపర్తి పద్మ, దేవరపల్లి అనిత పాల్గొన్నారు.

పేదరికం నిర్మూలనే లక్ష్యం : వర్ల

పామర్రు : పేదరికం నిర్మూలనే లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వం ముం దుకు సాగుతోందని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. బోల్లా శేఖర్‌కు టీడీపీ అందించిన టిఫిన్ బండిని ఆయన ప్రారంభించారు. తొలుత జుర్జువరంలో జరిగిన జాతర మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. వల్లూరిపల్లి గణేష్, వీరంకి వెంకటేశ్వరరావు, పరసె సుబ్రమణ్యం, పామర్తి వెంకయ్య, చాట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు కుంభాకార దర్పణాలు

అవనిగడ్డ రూరల్ : రోడ్డు ప్రమాదాల నివారణకు మలుపుల్లో కుంభాకార దర్పణాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై కొప్పిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. పులిగడ్డ చేపల మార్కెట్ సెంటర్, జడ్పీ హైస్కూల్ కరకట్ట మలుపుల్లో కుంభాకార దర్పణాలు ఏర్పాటు చేశారు. కుంభాకార దర్పణాలతో మలుపుల్లో వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనం 50 మీటర్ల ముందు కనిపించడంతో ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందన్నారు.

ఉండ్రపూడి మాజీ సర్పంచ్ దాసు గంగాధరరావు మృతి



పామర్రు : ఉండ్రపూడి మాజీ సర్పంచ్ దాసు గంగాధరరావు (68) శుక్రవారం కన్నుమూశారు. ఉండ్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వీరాంజనేయ స్వామి దేవస్థానం చైర్మన్‌గా కూడా ఆయన పనిచేశారు. మాజీ ఎమ్మెల్యేలు డీవై దాసు, కైలే అనిల్‌కుమార్, ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, సర్పంచ్ తోట పోలాక్షి, తాడిశెట్టి సాంబశివరావు సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



ముంజులూరులో ప్రతిభ చూపిన విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకం

బంటుమిల్లి : టెన్త్ పరీక్షల్లో ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులకు ముంజులూరు గ్రామస్థులు ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశారు. మాజీ సర్పంచ్ వెంకట సుబ్రమణ్యం జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ముంజులూరు వెంకట ఫణి రాజశేఖర్ ప్రతిభ చూపిన కొక్కు శ్రావణికి రూ.5 వేలు, గూట్ల చరిష్మా నాగశ్రీకి రూ.3 వేలు, పిలగాల రాజశ్రీకి రూ.2 వేలు ప్రోత్సాక నగదు అందజేశారు. విద్యా కమిటీ చైర్మన్ పంచకర్ల నాగకల్యాణి, సర్పంచ్ కె.సునీత, కూనపరెడ్డి శ్రీనివాసరావు, మండల టీడీపీ కన్వీనర్ కూనపరెడ్డి వీరబాబు, జోగి గౌరీ శంకర్, హెచ్‌ఎం పి. విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

రావెళ్ల ఫౌండేషన్ ఆర్థిక సాయం



చల్లపల్లి : మంగళాపురానికి చెందిన రావెళ్ల ఫౌండేషన్ వ్యవస్థాపకులు రావెళ్ల ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో వేర్వేరు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు జరిగాయి. విద్యుదాఘాతంతో కాళ్లు, చేతులు కోల్పోయిన పాలకొండ గ్రామ కార్యదర్శికి ఉదయ్‌కుమార్ రూ.10 వేలు అందజేశారు. విశాఖపట్నంలో పేద విద్యార్థినికి మరో రూ.10 వేలను ఆర్థికసహాయంగా అందించారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించండి

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నంలో శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని చిలకలపూడి సీఐ ఎస్‌కె అబ్దుల్ నబి అన్నారు. నబీని తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, టీడీపీ నాయకులు పి.వి. ఫణికుమార్, దివి మహేష్, సచివాలయ మహిళా కానిస్టేబుల్ వై. మాధవి తదితరులు కలిశారు.

ఎంపీడీవో కృష్ణవేణి తనిఖీ

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు పంచాయతీ, సచివాలయం -1,2 లలో ఎంపీడీవో కృష్ణవేణి శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించాలన్నారు. సెప్టెంబరులో పెన్షన్ల పంపిణీలో మొదటి స్థానం సాధించేలా కృషి చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ ఎంపీడీవోగా వెంకట రమణ



గుడివాడ రూరల్ : గుడివాడ ఎంపీడీవోగా అనగాని వెంకటరమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఏలూరు జిల్లా వెళ్లిన వెంకట రమణ తిరిగి పాత స్థానానికి వచ్చారు. కార్యాలయ సిబ్బంది ఆమెకు అభినందించారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



కపిలేశ్వరపురం (పమిడిముక్కల) : ట్రిపుల్ ఐటీ సీటు సాధించిన కొడాలి హేమ కృష్ణ, ఎం.ఉజ్వల్, కొండవీటి విజయ్‌కు రూ. 15 వేలు నగదు ప్రోత్సాహకాన్ని లయన్స్ క్లబ్ సభ్యుడు, సామాజిక వేత్త తాతినేని రమేశ్, ప్రవళి అందజేశారు. మాతృభూమి శ్రేయోసంఘం, ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. కె.రామమోహనరావు, టి. నరసింహారావు, వీరప్రకాశరావు, గంగాధర్‌రావు, హెచ్‌ఎం ఎం.ప్రభాకరరావు విద్యార్థులను అభినందించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

అవనిగడ్డ : సర్కిల్ పరిధిలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ జి.యువకుమార్ తెలిపారు. గంజాయి అమ్మకందారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమంగా మట్టి, ఇసుక, బుసక తవ్వకాలు జరిగినా కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

మద్యం స్వాధీనం

కోడూరు : ఇద్దరిని అదుపులోకి తీసుకుని అక్రమంగా తరలిస్తున్న 24 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పి.శిరీష తెలిపారు. ఎక్సైజ్ శాఖ అధికారుల కనుసన్నల్లోనే అక్రమ మద్యం తరలిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

మరియమాత మోక్షారోహణ పండుగ

చల్లపల్లి : సాలిపేట ఆర్సీఎం చర్చిలో శుక్రవారం మరియమాత మోక్షారోహణ పండుగ నిర్వహించారు. మచిలీపట్నం సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ కరస్పాండెంట్, ఆర్‌సీఎం ఫాదర్ వి.జోజిబాబు సందేశమిచ్చారు. ఆర్‌సీఎం విచారణ గురువులు బి.రవికుమార్, సురేష్, ప్రశాంత్, రత్నరాజు, విజయ్ ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

రైతులు సహకరించాలి

ఘంటసాల : భీమనది ఛానల్ చివరి ప్రాంత భూములకు సాగునీటి అందించేందుకు ఆయకట్టు రైతులు సహకరించాలని తహసీల్దార్ విజయ ప్రసాద్ పేర్కొన్నారు. చివరి ప్రాంత భూములకు సాగునీరు అందించేందుకు ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు తూములను మూసివేయటం జరుగుతుందన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



కూచిపూడి, ఆగస్టు 16 : శ్రావణమాసపు రెండో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. **పెడన రూరల్** : వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో జరిపారు. చెన్నూరు లక్ష్మీ నరశింహస్వామి, శివాలయం, చేవేంద్ర మదన గోపాలస్వామి ఆలయాల్లో కుంకు మ పూజలు నిర్వహించారు. **అవనిగడ్డ** : పులిగడ్డలోని అలివేలు, రాజ్యలక్ష్మి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అగ్నిహోత్రం ధన్వంతరాచారి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. **మోపిదేవి** : శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరిపారు. కొక్కిలిగడ్డ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వా మి ఆలయంలో అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు. **గుడ్లవ ల్లేరు** : వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఎన్‌ఆర్‌ఐ మహిళలు సైతం సొంత గ్రామాలకు వచ్చి ఇళ్లల్లో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించుకున్నారు. ముత్తైదువలకు తాంబూలం ఇచ్చి ఆశీస్సులు పొందారు. **పామర్రు** : వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పాతాళేశ్వరమ్మ, అంకమ్మ, కన్యకపరమేశ్వరి, గంగానమ్మ, పుట్టమ్మ ఆలయాల్లో పూజలు జరిపారు.

ఆదర్శ నేత గౌతు లచ్చన్న



మచిలీపట్నం టౌన్, ఆగస్టు 16 : సర్దార్ గౌతు లచ్చన్న నేటి తరానికి ఆదర్శమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. జయంతి సందర్భంగా బస్టాండ్ సెంటర్‌లోని గౌతు లచ్చన్న విగ్రహానికి మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరి, మాజీ ఎంపీ కొనకళ్ల, బీసీ నాయకుడు కొనకళ్ళ బుల్లయ్య, జనసేన ఇన్‌చార్జి బండి రామకృష్ణ, తదితరులు నివాళులర్పించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, ఐపీసీ కరుణకుమార్, బచ్చుల బోసు, కాగిత వెంకటేశ్వరరావు, కాగిత గోపాలరావు, ఇలియాస్‌పాషా, కాంతారావు, విద్యాసాగర్, అంజిబాబు, శివ, మాదివాడ నరసింహారావు, కె.వి.వి.సత్యనారాయణ, దేవరపల్లి అనిత, కుంచే నాని, ఫణికుమార్ పాల్గొన్నారు.

ది కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్, బ్రాంచ్ : పెడన

పెడన మండలం

స్థిరాస్తి బహిరంగ వేలం ప్రకటన

బహిరంగ వేలము ప్రకటన

స్థిరాస్తి బహిరంగ వేలం ప్రకటన

కృష్ణాజిల్లా, పెడన మండలం, కృష్ణాజిల్లా సహకార బ్యాంకు లి., పెడన బ్రాంచినకు ఈ దిగువ తెలిపిన బకాయిదారుల నుండి బకాయిపడిన సొమ్ము రాబట్టుకొనుటకు కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు పెడన బ్రాంచి వద్ద తేది. **21-08-2024** బుధవారం క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని బహిరంగ వేలము వేయబడునని యిందు మూలముగా యావన్మందికి తెలియపర్చడమైనది.

వేలము వేయబడు మెంబరు పేరు వారి యొక్క స్థిరాస్తుల వివరములు ఆస్తి వివరములు మరియు తేదీ, సమయములు

క్ర. నెం.	ఇ.పి నెంబరు	పేరు తండ్రి/ భర్త పేరు	జామీనుదారు పేరు	స్థిరాస్తి వున్న గ్రామం	ఆర్.ఎస్.నెం./ డోర్ నెం	విస్తీర్ణము	హద్దులు	తేది మరియు సమయము
1.	292/2018-19	యర్లగడ్డ కృష్ణకుమారి W/o వై.వి.వి.ఆర్.మోహన్‌రావు		పెడన	Rs.No. 710	1452 Sq.Yard	తూర్పు : జంపాన సుబ్రహమణ్యం పడమర : జోగి రజని దక్షిణం : రోడ్ ఉత్తరం : పంట బోదె	21-08-2024 ఉదయం గం.11.00లకు
2.	345/2019-20	యార్లగడ్డ మౌనిక D/o వై.వి.వి.ఆర్.మోహన్‌రావు	యార్లగడ్డ కృష్ణకుమారి					
3	343/2019-20	మహమద్ రఫీ భాషా S/o బాజీ						
4.	346/2019-20	కాగిత కృష్ణ S/o వీరయ్య						
5.	293/2018-19	జోగి ఎలీషా S/o అర్జునరావు		పెడన	Rs.No. 710	1452 Sq.Yard	తూర్పు : జోగి రజని పడమర : జోగి వెంకట లక్ష్మి దక్షిణం : రోడ్ ఉత్తరం : పంట బోదె	21-08-2024 మధ్యాహ్నం గం.11.30లకు
6.	353/2019-20	కొప్పినేని శ్రీనివాస్ S/o పాండురంగారావు	జోగి ఎలీషా					
7.	355/2019-20	తాతా రాంబాబు S/o రంగారావు						
8.	354/2019-20	మాచవరపు ఉషా S/o సుభాని						
9.	294/2018-19	జోగి రజని W/o శ్రీనివాసరావు		పెడన	Rs.No. 710	1452 Sq.Yard	తూర్పు : యార్లగడ్డ కృష్ణకుమారి పడమర : జోగి ఏలీషా దక్షిణం : రోడ్ ఉత్తరం : పంట బోదె	21-08-2024 మధ్యాహ్నం గం.12.00లకు
10.	335/2019-20	మోటేపల్లి ప్రసాద్ S/o పిచ్చిరాజు	జోగి రజని					
11.	334/2019-20	తాతా అమల పావని W/o రాంబాబు						
12.	333/2019-20	షేక్ రజీనా బేగం W/o మహబూబ్						
13.	288/2018-19	జంపాన సుబ్రహ్మణ్యం S/o గిరిరాజు		పెడన	Rs.No. 710	1452 Sq.Yard	తూర్పు : జంపాన దుర్గాదేవి పడమర : యార్లగడ్డ కృష్ణకుమారి దక్షిణం : రోడ్ ఉత్తరం : పంట బోదె	21-08-2024 మధ్యాహ్నం గం.12.30లకు
14.	328/2019-20	వంగపతి బసవయ్య S/o వెంకటేశ్వరరావు	జంపాన సుబ్రహ్మణ్యం					
15.	330/2019-20	మాచవరపు సైదా బీ W/o సుభాని						
16.	329/2019-20	దాకినేని అజయ్ కుమార్ S/o రాధాకృష్ణమూర్తి						
17.	295/2018-19	జంపాన దుర్గాదేవి W/o సుబ్రహ్మణ్యం		పెడన	Rs.No. 710	1452 Sq.Yard	తూర్పు : గంజాల మల్లిఖార్జునరావు పడమర : జంపాన సుబ్రహ్మణ్యం దక్షిణం : రోడ్ ఉత్తరం : పంట బోదె	21-08-2024 మధ్యాహ్నం గం.1.00లకు
18.	332/2019-20	పెద్ది శివ S/o పెద్దిరాజులు	జంపాన దుర్గాదేవి					
19.	331/2019-20	మహమద్ నాగూల్ మీరా S/o బాజీ						
20.	382/2019-20	సామంతుల - సత్యనారాయణ వేణుగోపాల్ S/o వీరయ్య						
21.	290/2018-19	అంతెం లక్ష్మీశ్రీనివాస్ S/o వాగేశ్వరరావు		పెడన	Rs.No. 710	1452 Sq.Yard	తూర్పు: జోగి శ్రీనివాసరావు పడమర: కాగిత శివాజీ దక్షిణం: రోడ్ ఉత్తరం: పంట బోదె	21-08-2024 మధ్యాహ్నం గం.1.30లకు
22.	339/2019-20	మట్లపూడి రామ్మోహనరావు S/o మధుసూదనరావు	అంతెం లక్ష్మీశ్రీనివాస్					
23.	338/2019-20	గోవిందలపూడి నారాయణమూర్తి S/o చంద్రరావు						
24.	340/2019-20	షేక్ అబ్దుల్ రవూఫ్ S/o రహీమ్						
25.	297/2018-19	జోగి వెంకట లక్ష్మి W/o శ్రీనివాసరావు		పెడన	Rs.No. 710	1452 Sq.Yard	తూర్పు : జోగి ఏలీషా పడమర : జోగి శ్రీనివాసరావు దక్షిణం : రోడ్ ఉత్తరం : పంట బోదె	21-08-2024 మధ్యాహ్నం గం.2.00లకు
26.	351/2019-20	మట్లపూడి శ్రీ నిర్మల D/o సత్యనారాయణ	జోగి వెంకటలక్ష్మి					
27.	352/2019-20	తాతా రాంబాబు S/o వజ్ర కంఠేశ్వరరావు						
28.	350/2019-20	షేక్ సమీనా W/o బాజీ						
29.	296/2018-19	జోగి శ్రీనివాసరావు S/o సుబ్బారావు		పెడన	Rs.No. 710	1452 Sq.Yard	తూర్పు : జోగి వెంకటలక్ష్మి పడమర : అంతెల లక్ష్మి శ్రీనివాస్ దక్షిణం : రోడ్ ఉత్తరం : పంట బోదె	21-08-2024 మధ్యాహ్నం గం.2.30లకు
30.	349/2019-20	తోట నాగ మనోహర్ S/o రామమూర్తి	జోగి శ్రీనివాసరావు					
31.	348/2019-20	తాతా ధనలక్ష్మి W/o రాంబాబు						
32.	347/2019-20	షేక్ సుభాని D/o జానీ						
33.	289/2018-19	గంజాల మల్లిఖార్జునరావు S/o సుబ్బారావు		పెడన	Rs.No. 710	1452 Sq.Yard	తూర్పు : గంజాల కోటేశ్వరమ్మ పడమర : జంపాన దుర్గాదేవి దక్షిణం : రోడ్ ఉత్తరం : పంట బోదె	21-08-2024 మధ్యాహ్నం గం.3.00లకు
34.	360/2019-20	పెద్ది నాగేశ్వరరావు S/o సోములు	గంజాల మల్లిఖార్జునరావు					
35.	337/2019-20	కాగిన వీరయ్య S/o కృష్ణయ్య						
36.	336/2019-20	మాచవరపు శశిప్ప W/o శ్రీను						
37.	291/2018-19	గంజాల కోటేశ్వరమ్మ W/o మల్లిఖార్జునరావు		పెడన	Rs.No. 710	1452 Sq.Yard	తూర్పు : గంజాల జగన్‌బాబు పడమర : గంజాల మల్లిఖార్జునరావు దక్షిణం : రోడ్ ఉత్తరం : పంట బోదె	21-08-2024 మధ్యాహ్నం గం.3.30లకు
38.	342/2019-20	పెద్ది నాగలక్ష్మి D/o నాగేశ్వరరావు	గంజాల కోటేశ్వరమ్మ					
39.	344/2019-20	షేక్ బాజీ S/o జానీ						
40.	341/2019-20	సామంతుల ప్రియవర్ష W/o ఎస్.ఎస్.వి.ఎస్.ప్రకాష్						
41.	298/2018-19	గంజాల జగన్‌బాబు S/o మల్లిఖార్జునరావు		పెడన	Rs.No. 710	1065 Sq.Yard	తూర్పు : గోపు కృష్ణ పడమర : గంజాల కోటేశ్వరమ్మ దక్షిణం : రోడ్ ఉత్తరం : పంట బోదె	21-08-2024 మధ్యాహ్నం గం.4.00లకు
42.	325/2019-20	బోయిన ఏసురాజు S/o ఆఫీస్	గంజాల జగన్ బాబు					
43.	326/2019-20	తాతా వీర వెంకటేశ్వరరావు S/o వజ్ర కంఠేశ్వరరావు						
44.	327/2019-20	కొనకళ్ల వీర వెంకట నాగరాజు S/o నరసింహారావు						

గమనిక : 1) వేలము పాటలో పాల్గొనువారు ధరావత్తుగా రూ. 1,00,000/- (లక్ష రూపాయలు) ముందస్తు ధరావత్తుగా చెల్లించవలెయును. E.M.D. వేలం పూర్తి అయిన తదుపరి తిరిగి చెల్లించబడును. 2) సదరు బహిరంగ వేలములో షరతులకు లోబడి అందరి కన్నా ఎక్కువ పాటదారునిపేర స్థిరాస్తిని కొట్టివేయబడును. 3) వేలములో పాల్గొనుటకు ముందుగా స్థిరాస్తి అంతయు స్వయంగా పరిశీలించుకొనవలెను. 4) వేలము నందు పాల్గొనువారు స్వయంగా పాల్గొనవలయును 5) వేలము పాట పాడుకొనువారు పాట మొత్తములో రూ. 100/-లకు, రు. 15/-లు చొప్పున వెంటనే డిపాజిట్ చేయవలెను. మిగిలిన మొత్తమును 15 రోజులలోపు పూర్తిగా చెల్లించవలెను. 6) ఎటువంటి కారణములు తెలుపకనే వేలమును వాయిదా వేయుటకు మరియు వేలమును రద్దు పరుచుటకు సేల్ ఆఫీసర్ వారికి పూర్తి అధికారము కలదు. 7) వేలం వేయబోవు స్థిరాస్తి స్వభావము మరియు నిర్ధారణ వేలము నందు పాల్గొనువారు పూర్తి బాధ్యత వహించవలెను. 8) వేలం నందు పాల్గొనువారు తమ యొక్క ఆధార్ కార్డ్, మరియు పాన్‌కార్డ్, జిరాక్స్ కాపీ సమర్పించవలెను. 9) ఆసక్తిగలవారు యితర వివరములకు బ్యాంక్ పనిచేయువేళల యందు ఈ క్రింది వారిని సంప్రదించవలయును.

మేనేజర్, కె.డి.సి.సి. బ్యాంక్,
పెడన బ్రాంచి సెల్ : 99496 88363

అసిస్టెంట్ రిజిష్ట్రారు / సేల్ ఆఫీసర్
కె.డి.సి.సి. బ్యాంక్ లి., విజయవాడ

వైసీపీ ఐపీఎస్‌లు సెలవులో..!

- 16 మంది మూకుమ్మడిగా పెట్టారని ప్రచారం
- ఆరుగురే అడిగారంటున్న అధికారులు
- దీర్ఘకాలిక సెలవుపై వెళ్లాలని అత్యధికుల యోచన!

అమరావతి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అధికార పార్టీకి కొమ్ముకాసి.. కొత్త ప్రభుత్వంలో పోస్టింగ్ దక్కని 16 మంది ఐపీఎస్ అధికారులు ఇప్పుడు సెలవులో వెళ్లారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న వీరంతా మూకుమ్మడిగా సెలవు పెట్టినట్లు ప్రచారం జరిగింది. అయితే అందరూ సెలవు పెట్టలేదని, వారాంతం కావడంతో ఆరుగురు మాత్రమే తాత్కాలిక సెలవు కోరారని పోలీసు శాఖలోని ఉన్నత స్థాయి వర్గాలు తెలిపాయి. ఎన్నికల ముందు ఏకపక్షంగా వ్యవహరించి, జగన్ పార్టీ అరాచకాలకు కొమ్ముకాసిన పలువురు ఐపీఎస్ అధికారులను ఎన్నికల కమిషన్ (ఈసీ) పక్కన బెట్టిన సంగతి తెలిసిందే. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక.. నిరీక్షణలో ఉన్న పోలీసు అధికారులపై గతంలో పలు ఆరోపణలు ఉండడంతో వాటిపై విచారించి నివేదిక ఇవ్వాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ఆదేశించింది. విషయం తెలుసుకున్న వైసీపీ ఐపీఎస్‌లు కొందరు.. ఏకంగా విజిలెన్స్ అధికారులకే ఫోన్ చేసి తమ పాత్రను చూపించొద్దని కోరినట్లు ఫిర్యాదులందాయి. దీంతో వెయిటింగ్‌లో ఉన్న ఐపీఎస్‌లందరూ ప్రతి రోజూ పోలీసు ప్రధాన కార్యాలయానికి వచ్చి రిజిస్టర్‌లో సంతకాలు చేయాలని డీజీపీ ద్వారకా తిరుమలరావు ఈ నెల 12న సర్క్యులర్ జారీ చేశారు. అయితే 15న స్వాతంత్ర్య దినోత్సవం, ఆ తర్వాత శని, ఆది వారాలు సెలవు కావడంతో వీరిలో కొందరు ఈ నెల 13, 14న.. మరికొందరు 16న సెలవు పెట్టినట్లు తెలిసింది. లాంగ్ వీకెండ్ రావడంతో మధ్యలో సెలవులు పెట్టుకున్నారని, సోమవారం రాఖీ పండుగ తర్వాత వారు వచ్చే అవకాశం ఉందని సదరు వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా.. ప్రతి రోజూ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు వచ్చి నిరీక్షించడం అవమానకరంగా ఉంటుందని ఆ 16 మందిలో అత్యధికులు మధనపడుతున్నట్లు తెలిసింది. రోజూ ఉదయం పదింటికి వెళ్లి సాయంత్రం ఐదింటి వరకూ ఊరకే పనిలేకుండా కూర్చోవడం కంటే దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడం మంచిదని వారు అభిప్రాయపడుతున్నట్లు సమాచారం. కాగా.. ఐపీఎస్‌ల సెలవుపై ప్రభుత్వ వర్గాలు స్పందించాయి. సెలవు అడిగినంత మాత్రాన ఇవ్వాలని లేదని.. సహేతుక కారణం చూపితేనే మంజూరు చేస్తారని.. నచ్చినట్లు సెలవు పెడతామంటే కుదరదని స్పష్టం చేశాయి. నిఘా మాజీ అధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులు, సీఐడీ మాజీ చీఫ్‌లు సునీల్ కుమార్, సంజయ్‌కి ప్రభుత్వమే (జీఏడీ) సెలవు మంజూరు చేయాల్సి ఉంటుంది. మిగిలిన 13 మందిలో ఎవరికి సెలవు ఇవ్వాలన్నది డీజీపీ ఇష్టం.

10 మంది ఐపీఎస్‌ల బదిలీ

- అనంత ఎస్పీగా జగదీశ్.. విశాఖ ఏపీఎస్పీకి మురళీకృష్ణ
- బెజవాడ డీసీపీగా మహేశ్వరరాజు
- డీజీపీ ఆఫీసుకు సత్యయేసుబాబు
- 12 మంది నాన్-కేడర్ ఎస్పీలు, 49 మంది అదనపు ఎస్పీలకూ స్థానచలనం



అమరావతి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పది మంది ఐపీఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. అనంతపురం ఎస్పీ మురళీకృష్ణను విశాఖపట్నం ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా పంపి.. ఆయన స్థానంలో జగదీశ్‌ను నియమించింది. ఇంటెలిజెన్స్ ఎస్పీ సత్యయేసుబాబును డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఆయన స్థానంలో సచికేత్ విశ్వనాథ్‌ను నిఘా ఎస్పీగా నియమించింది. విజయవాడ డీసీపీగా మహేశ్వర రాజుకు, గుంతకల్ రైల్వే ఎస్పీగా రాహుల్ మీనాకు పోస్టింగ్ ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ఇంకోవైపు.. 12 మంది నాన్-కేడర్ ఎస్పీలను, 49 మంది అదనపు ఎస్పీలను కూడా ప్రభుత్వం బదిలీచేసింది. నాన్-కేడర్‌లో ఐదుగురిని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఆదేశించారు. వీరిలో వైసీపీతో అంటకాగిన నిఘా డీసీపీ ఆనంద రెడ్డి, విజయవాడ విజిలెన్స్ ఎస్పీ కరీముల్లా షరీఫ్, శ్రీకాకుళం ప్రాంతీయ విజిలెన్స్ అధికారి సురేశ్ బాబు, విశాఖ క్రైం డీసీపీ వెంకటరత్నం, విశాఖ కమిషనర్ అటాచ్‌మెంట్‌లో ఉన్న లక్ష్మీనారాయణ ఉన్నారు. అలాగే 15 మంది అదనపు ఎస్పీలను కూడా డీజీపీ ఆఫీసులో రిపోర్టు చేయాలని నిర్దేశించారు.

పది మంది ఐపీఎస్‌ల బదిలీలు ఇలా..

అధికారి	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
సత్య యేసుబాబు	ఎస్పీ, ఇంటెలిజెన్స్	డీజీపీ ఆఫీసులో రిపోర్టు
గరుడ్ సుమిత్ సునీల్	వెయిటింగ్	గ్రూప్ కమాండర్, గ్రేహౌండ్స్
పి. జగదీష్	వెయిటింగ్	ఎస్పీ, అనంతపురం
కేవీ మురళీకృష్ణ	ఎస్పీ, అనంతపురం	కమాండెంట్, ఏపీఎస్పీ, విశాఖ
కేఎం మహేశ్వరరాజు	ఎస్పీ, సెబ్	డీసీపీ, విజయవాడ
సునీల్ సొరెన్	ఎస్‌డీపీవో, పార్వతీపురం	గ్రూప్ కమాండర్, గ్రేహౌండ్స్
రాహుల్ మీనా	ఏఎస్పీ, చింతూరు	రైల్వే ఎస్పీ, గుంతకల్
సచికేత్ విశ్వనాథ్	ఏఎస్పీ, గుంటూరు తూర్పు	ఎస్పీ, ఇంటెలిజెన్స్
పంకజ్ కుమార్ మీనా	అసాల్ట్ కమాండర్, గ్రేహౌండ్స్	ఏఎస్పీ, చింతూరు
సురాన అంకిత మహవీర్	అసాల్ట్ కమాండర్, గ్రేహౌండ్స్	ఎస్‌డీపీవో, పార్వతీపురం

ఎందుకీ ఏడుపు?

- ఐఏఎస్, ఐపీఎస్‌లకు అవమానమట!
- రెండు నెలలుగా పోస్టింగ్ ఇవ్వలేదంటూ ఏడుపు
- ఐదేళ్లలో జగన్ చేసిన నిర్వాకం ఏమిటి?
- చెప్పింది వినకుంటే శంకరగిరి మాన్యాలే
- 'అన్నా' అంటూ సీఎస్‌గా ఉన్న ఎల్వీని ఏం చేశారు?
- 15 మంది ఐఏఎస్, ఐపీఎస్‌లు నెలల తరబడి వెయిటింగ్
- సీనియర్ ఐపీఎస్ ఏబీవీపై ఐదేళ్లూ కక్ష సాధింపే
- సాయిప్రసాద్‌కు 8 నెలలు నో పోస్టింగ్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఐఏఎస్‌లను 'అయ్యో..ఎస్'లుగా మార్చి... ఐపీఎస్‌లతో 'వైసీపీ' చట్టాన్ని అమలు చేయించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిదే! ఇప్పుడు... ఐఏఎస్, ఐపీఎస్‌ల ఆత్మగౌరవంపై ఆటవిక దాడి జరుగుతోందంటూ ఆయన రోత పత్రిక వాపోతోంది. పలువురు అఖిలభారత సర్వీసు అధికారులకు రెండు నెలలుగా పోస్టింగ్ ఇవ్వకుండా అవమానిస్తోందని తెగ ఆవేదన వ్యక్తం చేసింది. అంతటితో ఊరుకోకుండా... జగన్మోహన్ రెడ్డి ఇలా ఎవరికీ పోస్టింగులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టలేదని, 'ఉత్తమ సంప్రదాయాలు' పాటించారని ఓ సర్టిఫికెట్ ఇచ్చేసింది. 'ఇదంతా నిజమేనా? కొంతైనా నిజం ఉండొచ్చు' అని నమ్మితే తప్పులో కాలేసినట్లే! జగన్ ఐదేళ్ల జమానాలో... ఐఏఎస్, ఐపీఎస్‌లకు నిత్య నరకమే! చెప్పింది విన్న వాళ్లకే అందలం! కాదంటే... శంకరగిరి మాన్యాలే!

వీళ్లను వేధించింది ఎవరు?

'జగన్ ఎవరికీ పోస్టింగ్‌లు ఇవ్వకుండా ఆపలేదు' అంటూ ఆయన రోతపత్రిక పచ్చి అబద్ధాలు రాసింది. ప్రస్తుతం సీఎంవో ముఖ్యకార్యదర్శిగా ఉన్న సీనియర్ ఐఏఎస్ ముద్దాడ రవిచంద్రను 2023లో పక్కన పెట్టేశారు. ఎన్నికలయ్యే దాకా ఆయనకు పోస్టింగ్ దక్కలేదు. జగన్ ప్రభుత్వం తెచ్చిన ఒక అడ్డగోలు ఆర్డినెన్స్‌ను సమర్థించలేదనే ఏకైక కారణంతో సీనియర్ ఐఏఎస్ అధికారి ఆర్పీ సిసోడియాకు ఆర్నెళ్లు పోస్టింగ్ ఇవ్వలేదు. ఆ తర్వాత పెద్దగా పనేమీ ఉండని హెచ్చార్డీకి విసిరి కొట్టారు. 'మాతో పెట్టుకుంటే ఇలాగే ఉంటుంది' అని ఇతర ఐఏఎస్‌లకు హెచ్చరిక పంపించారు. ఇక... చంద్రబాబు హయాంలో యూపీ నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన సీనియర్ ఐఏఎస్ అధికారి రాజమౌళిని తీవ్ర స్థాయిలో ఇబ్బంది పెట్టారు. ఆయనను ఇక్కడ రిలీవ్ చేయకుండా... 14 నెలల పాటు వెయిటింగ్‌లో ఉంచి పైశాచికం ప్రదర్శించారు.

జగన్ వల్లే అసలైన అవమానం..

ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లకు అవమానం జరిగిందంటే... అది జగన్ నిర్వాకం వల్లే! జగన్ పాపాల వల్లే శ్రీలక్ష్మి, బీపీ ఆచార్య వంటి ఐఏఎస్‌లు జైలు పాలయ్యారు. ఆయన ముఖ్యమంత్రి అయ్యాక సగటున నెలకు ఒక ఐఏఎస్, ఐపీఎస్ అధికారి తల దించుకుని హైకోర్టు ముందు నిలవాల్సిన పరిస్థితి వచ్చింది. కొందరికి శిక్షలు కూడా పడ్డాయి. కోర్టు దయతలచి మినహాయింపు ఇవ్వకుంటే వారూ జైళ్లకు వెళ్లే వారే. ఐఏఎస్, ఐపీఎస్‌లను తన సొంత పాలేర్లలా వాడుకున్న ఘనత జగన్‌ది. తన మాటకు తలూపితే ఒక లెక్క.. తప్పును ఎత్తి చూపితే మరో లెక్క! బ్యూరోక్రాట్లను అడ్డదిడ్డంగా వాడుకుని తర్వాత ఊడ్చిపడేయడం ఆయన నైజం. సీఐడీ చీఫ్‌గా పని చేసిన సునీల్ కుమార్‌ను టీడీపీ నేతలను వేధించేందుకు అడ్డగోలుగా వాడుకుని... ఎక్కడో తేడా రావడంతో ఆయనను ఎక్కడో పడేయడం మచ్చుకు ఒక ఉదాహరణ.

ఇది సత్కారమా?

జగన్ పాలనలో 15 మంది ఐఏఎస్, ఐపీఎస్‌లను... 170 మందికి పైగా అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలను నెలలు, సంవత్సరాల తరబడి పోస్టింగ్‌లు ఇవ్వకుండా 'వెయిటింగ్'లో పెట్టారు. ఇది... వాళ్లను అవమానించడం కాదా? ఐపీఎస్‌లలో అత్యంత సీనియర్‌ను డీజీపీగా నియమించాలి. కనీసం... టాప్-5 నుంచి డీజీపీని ఎన్నుకోవడం రివాజు. కానీ... ఎక్కడో 15వ స్థానంలో ఉన్న రాజేంద్రనాథ్ రెడ్డికి జగన్ డీజీపీ పోస్టు కట్టబెట్టారు. ఇది... సీనియారిటీ లిస్టులో ఆయనకంటే పైన ఉన్న 14 మందిని అవమానించడం కాదా?

అబ్బో... ఎంత పెద్ద మనసో!

చంద్రబాబు హయాంలో సీఎం కార్యాలయంలో పని చేసిన సాయిప్రసాద్‌కు కీలక పోస్టు ఇచ్చి జగన్ చాలా పెద్ద మనసు ప్రదర్శించారని కూడా ఆయన రోత పత్రిక గొప్పలకు పోయింది. కానీ... జగన్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన మరుసటి రోజునే సాయిప్రసాద్‌ను తప్పించేశారు. ఏకంగా 8 నెలలు వెయిటింగ్‌లో పెట్టారు. ఆ తర్వాత రెండేళ్లపాటు అప్రాధాన్య పోస్టులే ఇచ్చారు. 'మీరు చెప్పినట్లువింటాం' అని శరణుజొచ్చిన వాళ్లకు, ఢిల్లీ స్థాయిలో ఒత్తిడి చేయించిన వాళ్లకు మాత్రమే జగన్ సర్కారు పోస్టులు ఇవ్వడం అక్షరాలా నిజం!

'జగన్ బ్యాచ్'అని ఒప్పుకొన్నట్లేనా?

జగన్ హయాంలో పదుల కొద్దీ అధికారులను నెలల తరబడి వెయిటింగ్‌లో పెట్టడం నిజం. 'ఎందుకు' అని ప్రశ్నిస్తే... సరైన జవాబు కూడా చెప్పలేరు. ఇప్పుడేమో.. ఐఏఎస్, ఐపీఎస్‌లకు 'రెండు నెలలు'గా పోస్టింగ్‌లు ఇవ్వలేదంటూ జగన్ పత్రిక వాపోయింది. వీళ్లంతా జగన్ సేవలో తరించిన వారేనంటూ చెప్పకనే చెప్పింది. ప్రభుత్వం మారినప్పుడు కీలక స్థానాల్లో ఉండే అధికారులను మార్చడం సహజం! పైగా... ఇప్పుడు 'వెయిటింగ్'లో ఉన్న వారిలో అత్యధికులు 'మామూలు' అధికారులు కాదు. చంద్రబాబు, లోకేశ్, టీడీపీ కీలకనేతలను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు, అరెస్టులే ధ్యేయంగా పని చేసిన వాళ్లే! తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న వారూ ఉన్నారు. అయినా... వీళ్లెవరినీ చంద్రబాబు ప్రభుత్వం సస్పెండ్ చేయలేదు. ప్రభుత్వం మారిన తర్వాత పోస్టింగ్‌ల విషయంలో ఆచితూచి వ్యవహరించడం సహజం! ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి విషయంలో మరింత జాగ్రత్తగా ఉంటారు. ఇప్పటికీ ఐఏఎస్, ఐపీఎస్‌ల పోస్టింగ్‌ల ప్రక్రియ జరుగుతూనే ఉంది. కానీ... 'మా వాళ్లకు అన్యాయం, అవమానం' అని జగన్ రోత పత్రిక వాపోయింది.

రెండు నెలలకే అంత ఏడుపా?

పలువురు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు చట్టాలు, నిబంధనలు ఉల్లంఘించినప్పటికీ... అక్రమాలపై సాక్ష్యాధారాలున్నప్పటికీ కూటమి ప్రభుత్వం వారిని సస్పెండ్ చేయలేదు. వాళ్లంతా సర్వీసులోనే ఉన్నారు. అంటే వేతనంతో పాటు ఇతర సౌకర్యాలు కూడా అనుభవిస్తారు. పోస్టింగ్ ఇవ్వకుండా జీఏడీకి, డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేసిన అధికారులు రోజూ ప్రధాన కార్యాలయానికి వెళ్లాలి. మిగిలిన అధికారులతోపాటు కూర్చోవాలి. వీరిని అత్యవసర సేవలకు ఉపయోగించుకునే అవకాశముంటుంది. ఏవైనా కారణాల వల్ల రాలేకపోతే... ముందస్తు అనుమతి తీసుకోవాలి. కానీ... 'వెయిటింగ్'లో ఉన్న 16 మంది ఐపీఎస్‌లు హెడ్‌క్వార్టర్స్‌కే రావడంలేదు. అందుకే... రోజూ ఆఫీసుకు వచ్చి సంతకం చేయాలని డీజీపీ మెమో జారీ చేశారు. ఇదేమీ నిబంధనలకు విరుద్ధం కాదు! కానీ... 'మా వాళ్లను ఆఫీసుకు పిలిచి సంతకం చేయమంటారా?' అని జగన్ పత్రిక వాపోవడమే విచిత్రం!

ఎల్వీపై తొలి వేటు..



సీనియర్ ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రమణ్యానికి జగన్ చేసిన అవమానం అంతా ఇంతా కాదు. చీఫ్ సెక్రటరీగా ఉన్న ఎల్వీని 'అన్నా.. అన్నా' అంటూ ప్రేమంతా ఒలకబోశారు. తర్వాత కొన్నాళ్లకే... ఎలాంటి కారణం చూపకుండానే ఆయనను బాపట్లలోని మానవ వనరుల విభాగానికి తరిమేశారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే సీఎస్ హోదాలో ఉన్న ఏ అధికారికీ ఎదురుకాని అనుభవమిది! ముఖ్యమంత్రి హోదాలో జగన్ తీసుకునే అడ్డగోలు, అర్థరహిత నిర్ణయాలకు తల ఊపలేదనే ఏకైక కారణంతోనే ఎల్వీని పక్కకు తప్పించినట్లు ఐఏఎస్ వర్గాల్లో ప్రచారం జరిగింది. 'నా మాట వినకుంటే అంతే' అంటూ బ్యూరోక్రాట్లకు జగన్ ఇలా హెచ్చరికలు పంపించారు.

ఏబీవీని ముప్పుతిప్పలు పెట్టలేదా?



సీనియర్ ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వర రావును జగన్ సర్కారు ముప్పుతిప్పలు పెట్టింది. ట్రైబ్యునల్ తీర్పులు, కోర్టు ఉత్తర్వులు ఎలా ఉన్నా.. సస్పెన్షన్ల మీద సస్పెన్షన్లు చేసింది. ఆయనకు యూనిఫామ్ దూరం చేసి వికృతానందం పొందింది. సస్పెన్షన్ ఎత్తివేశాకా నెలలతరబడి పోస్టింగ్ ఇవ్వలేదు. చివరికి.. పదవీ విరమణ చేసే రోజున పోస్టింగ్ ఇచ్చింది. ఇక... మరో ఐపీఎస్ అధికారి బాలసుబ్రమణ్యంనూ జగన్ ఇలాగే సతాయించారు. రెండు విడతల్లో ఐదునెలలు పోస్టింగ్ ఇవ్వలేదు. ఆయనకు జగన్ ఇచ్చిన పోస్టింగ్‌లు కూడా అప్రాధాన్యమైనవే!

ఆ ఐదేళ్లు ఏం చేసినట్లు?

ఏపీలో ఐఏఎస్, ఐపీఎస్‌లకు అవమానం జరుగుతోందంటూ దేశవ్యాప్తంగా సివిల్ సర్వెంట్లు మండిపడుతున్నారని జగన్ పత్రిక ఆక్రోశించింది. ఐపీఎస్ సర్వీసు వదులుకుని రాజకీయాల్లో చేరిన ఒక మాజీ ఐపీఎస్ అధికారి, ఇంకో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి కూడా... ఏపీ ప్రభుత్వ చర్యలు మూర్ఖత్వం, అసంబద్ధం అని కన్నెర్ర చేశారు. జగన్ ఐదేళ్ల హయాంలో బ్యూరోక్రాట్ల పరిస్థితి వీళ్లకు తెలియదా? తెలిసీ మాట్లాడలేదా? అప్పుడు కూడా నోరెత్తకుండా... ఇప్పుడు మాట్లాడే నైతిక అర్హత వీరికి ఉంటుందా?

వైసీపీ మాజీ ఎంపీ
భవనంలో వ్యభిచారం!

- ఒక అంతస్థులో క్రెడాయ్ ఆఫీస్
- మరో 4 అంతస్థుల్లో గదులు అద్దెకు
- అక్కడ అసాంఘిక కార్యకలాపాలు
- సాగుతున్నట్టు పోలీసుల తనిఖీల్లో వెల్లడి
- ముగ్గురు మహిళలతో పాటు
- హోటల్ నిర్వాహకుడు, మరొకరు అరెస్టు
- నగరంలోని 121 లాడ్జీలలో ఆకస్మిక తనిఖీలు
- విశాఖలో పది కిలోల గంజాయి స్వాధీనం

విశాఖపట్నం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలోని శివాజీపాలెంలో ఉన్న మాజీ ఎంపీకి చెందిన భవనంలో నడుస్తున్న హోటల్‌లో వ్యభిచారం జరుగుతున్నట్టు పోలీసుల తనిఖీల్లో బయటపడింది. అక్కడున్న ముగ్గురు మహిళలను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వీరిలో ఒక మైనర్ కూడా ఉన్నట్టు సమాచారం. ఇతర రాష్ట్రాల్లో నేరాలకు పాల్పడిన నిందితులు విశాఖపట్నం వచ్చి తలదాచుకుంటున్నారన్న సమాచారం అందడంతో సిటీ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ హోటళ్లు, లాడ్జీలపై దృష్టి సారించారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు నగరం నలుమూలలా తనిఖీలు చేపట్టారు. 400 మంది సిబ్బందిని 80 బృందాలుగా ఏర్పాటుచేసి 121 లాడ్జీలు, హోటళ్లు తనిఖీ చేయించారు. ఈ క్రమంలో నాలుగుచోట్ల 10.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కాగా, విశాఖ మాజీ ఎంపీ, వైసీపీ నేత ఎంవీవీ సత్యనారాయణకు శివాజీపాలెంలోని శివాజీపార్కుకు ఎదురుగా 'ఎంవీవీ భవన్' పేరుతో ఐదు అంతస్థుల భవనం ఉంది. దీనిలో ఒక అంతస్థులో రియల్ ఎస్టేట్ వ్యాపారుల అసోసియేషన్ 'క్రెడాయ్' కార్యాలయం నిర్వహిస్తున్నారు. మిగిలిన నాలుగు అంతస్థులలో గదులను అద్దెకు ఇచ్చారు. అక్కడ తనిఖీలు నిర్వహించినప్పుడు వ్యభిచారం జరుగుతున్నట్టు పోలీసులు గుర్తించారు. ఈ విషయమై ఎంవీపీ స్టేషన్ సీఐ సంజీవరావు మాట్లాడుతూ ఎంవీవీ భవన్‌లో నడుస్తున్న హోటల్‌లో తనిఖీలు నిర్వహించినప్పుడు వ్యభిచారం జరుగుతున్నట్టు గుర్తించామన్నారు. అక్కడున్న ముగ్గురు మహిళలను, హోటల్ నిర్వాహకుడు సుశాంత్‌ను, మహిళలను తీసుకువచ్చిన మహేశ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.

అస్తవ్యస్తంగా లాడ్జీల నిర్వహణ

పోలీసుల తనిఖీల సందర్భంగా లాడ్జీల నిర్వహణలో ఎలాంటి నిబంధనలు, జాగ్రత్తలు పాటించడం లేదని తేలింది. చాలామంది విజిటర్స్ మానిటరింగ్ రిజిస్టర్స్ నిర్వహించడం లేదు. మరికొందరు మైనర్లను కూడా అనుమతిస్తున్నారు. ఇంకొందరు సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు. కొన్ని పనిచేయడం లేదు. మరికొన్నింటికి ఫుటేజీ బ్యాకప్ లేదు. గుర్తింపు కార్డులు లేకుండా గదులు ఇస్తున్నట్టు తేలింది. అగ్ని ప్రమాదాల నిర్వహణకు భద్రతాపరమైన ఏర్పాట్లు కూడా లేని భవనాలు గుర్తించారు. వారందరికీ హెచ్చరికలు జారీ చేశారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు పనులు చేస్తున్న యాజమాన్యాలపై కేసులు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ.. అపరిచితుల సంచారం ఏమైనా కనిపించినా, అనుమానం కలిగినా 7995095799 నంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు.



శివాజీపాలెంలోని ఎంవీవీ భవన్

రీసర్వే పేరుతో భూమి కొట్టేశారు

- చంద్రబాబుకు బెయిల్ వచ్చిందని టపాసులు పేల్చినందుకే అక్కసు
- వైసీపీ నేతల అరాచకంపై రైతు ఫిర్యాదు
- తన పొలం తనకు ఇప్పించాలని వినతి
- అధికారం ఉందని పేట్రేగిపోయారు
- చంద్రబాబు ఇంటిపై దాడి చేశారు
- మాజీ మంత్రి జోగిపై చర్యలు తీసుకోండి
- దివ్యాంగుల స్థలాలనూ వదల్లేదు.. ఆదుకోండి
- టీడీపీ ప్రజాదర్బార్‌లో ఫిర్యాదుల వెల్లువ



టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

అమరావతి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): "వైసీపీ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి చంద్రబాబును జైలుకు పంపించింది. ఆనాటి ఘటన మమ్మల్ని ఎంతో బాధపెట్టింది. ఆయన అక్రమ కేసుల నుంచి బయటకు రావాలని ఎదురు చూశాం. బెయిల్‌పై బాబు బయటకు వచ్చాక.. టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నాం. ఇది గిట్టని వైసీపీ నాయకులు కొందరు రీసర్వే పేరుతో మా పొలాన్ని కొట్టేశారు. సరిగ్గా ఎన్నికలకు ముందు వేరే వారి పేరుతో రాసేశారు. వైసీపీ నేతల అరాచకాలను అరికట్టి మా పొలం మాకు దక్కేలా చూడండి" అని చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు పాచిగుంట పంచాయతీకి చెందిన రైతు వడివేలు వాపోయారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో మంత్రి కొల్లు రవీంద్రకు వినతి పత్రం అందించారు.

- అధికారం అండ చూసుకుని ఆనాటి మంత్రి జోగి రమేశ్ పేట్రేగిపోయారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు టీడీపీ నాయకులు ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేశారు. పెడన నియోజకవర్గంలోని గూడూరు, కృత్తివెన్ను మండలాల నుంచి రౌడీలు, వైసీపీ కార్యకర్తలను తీసుకొచ్చి టీడీపీ అధినేత చంద్రబాబు ఇంటిపై జోగి దాడికి తెగబడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడులకు తెగబడిన వారిలో చీలం కుర్తి వెంకటశివకృష్ణ, ఈదా కిశోర్, ఆకన సాయికుమార్, పులగం నాయుడు, పాలపర్తి జాన్‌రత్నం, మండ్రు సాల్మన్‌రాజు, కారుమంచి కామేశ్వరరావు, పిండి వెంకన్నబాబు, మోటేపల్లి రత్నారావు, అల్లంశెట్టి నిరంజనరావు ఉన్నారని, వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.
- తమ ఇంట్లో మహిళల కోసం ఏర్పాటు చేసుకున్న బాత్‌రూంలను కొందరు రౌడీమూకలు ధ్వంసం చేసి స్థలాలను కబ్జా చేశారని గుంటూరు జిల్లా ప్రతిపాడు నియోజకవర్గం స్వర్ణభారతి నగర్‌కు చెందిన వారు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా తమను బెదిరించి ఇళ్లకు కరెంట్ కట్ చేసి, మీటర్లు సైతం తొలగించారని వాపోయారు.
- ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి మున్సిపాలిటీకి చెందిన పలువురు దివ్యాంగులు ప్రజాదర్బార్‌కు వచ్చారు. ప్రభుత్వం తమకు కేటాయించిన స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదు చేశారు. వైసీపీ నేతలతో కలిసి అక్రమ నిర్మాణాలకు సహకరించిన సీఎస్ఆర్ స్వామితో పాటు అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.
- సోషల్ ఆడిట్ సంస్థలో డీఆర్పీలుగా పనిచేస్తున్న తమను గత ప్రభుత్వం అన్యాయంగా తొలగించిందని, తాము ఉన్నంత వరకు విధుల్లోకి తీసుకోబోమని సోషల్ ఆడిట్ డైరెక్టర్ జగదీశ్ హెచ్చరించినట్టు పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని పలువురు కోరారు.
- తాను మీడియాలో పనిచేస్తున్నానని, తన యజమాని ఒక వార్తను గ్రూప్‌లో షేర్ చేయమంటే దాన్ని షేర్ చేసినందుకు మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాలతో తనపై అక్రమంగా కేసులు బనాయించి రిమాండ్‌కు పంపారని పల్నాడు జిల్లా రాజుపాలేనికి చెందిన తోకల సురేశ్ అనే వ్యక్తి వాపోయారు. తనపై నమోదైన అక్రమ కేసులు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
- డీఎస్సీలో కనీస వయస్సు పరిమితిని మరో ఐదేళ్లు పెంచి ఆదుకోవాలని నిరుద్యోగులు కోరారు. అదేవిధంగా గ్రంథాలయ ఉద్యోగులు, పింఛన్‌దారులు కూడా పలు సమస్యలపై ప్రజాదర్బార్‌లో వినతులు సమర్పించారు.

జగన్ పేరు తీసేయడం జాతీయ సమస్యా!

- ఢిల్లీకి వెళ్లిన వైసీపీ నేతలకు సిగ్గుండాలి: నక్కా ఆనందబాబు

అమరావతి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): 'విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం పీఠం మీద జగన్ పేరును తీసేస్తే అదేమైనా జాతీయ సమస్యా? దానివల్ల దళిత జాతికి ఏం నష్టం జరిగింది? దీని మీద ఢిల్లీ వెళ్లి ఎస్సీ కమిషన్‌ను కలిసిన వైసీపీ నేతలకు సిగ్గుండాలి. వైసీపీ హయాంలో రాష్ట్రంలో దళితుల ఊచకోత జరిగినప్పుడు ఏనాడైనా ఇదే నేతలకు ఎస్సీ కమిషన్ గుర్తుకు వచ్చిందా?' అని మాజీ మంత్రి, టీడీపీ నేత నక్కా ఆనందబాబు ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన టీడీపీ జాతీయ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోయినా ఆ పార్టీ నేతల్లో మార్పు రాలేదు. ఇంకా ఫేక్ ప్రచారాలనే నమ్ముకొన్నారు. ప్రజలు ఏమనుకొంటారో అన్న సిగ్గు కూడా లేదు. అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశాడని ఒకడు అంటే, ఏకంగా విగ్రహమే మాయమైందని మరొకడు అంటాడు. విగ్రహం వద్ద అంబేడ్కర్ పేరు తీసేశాడని ఇంకొకడు చెబుతాడు. ఇవి ఫేక్ ప్రచారాలు కావా? అంబేడ్కర్ విగ్రహం కింద తాటికాయంత అక్షరాలతో జగన్ తన పేరు పెట్టుకొంటే అంబేడ్కర్ అభిమానులు ఎవరో భరించలేక జగన్ పేరు ఉన్న అక్షరాలను తీసివేశారు. దానితో టీడీపీకిగాని... వైసీపీ ప్రభుత్వానికిగాని ఏ సంబంధం లేదు. అంబేడ్కర్ కంటే జగన్ గొప్పవాడా? విదేశీ విద్యకు అంబేడ్కర్ పేరు తీసేసి జగన్ తన పేరు పెట్టుకొన్నప్పుడు ఈ వైసీపీ నేతల నోళ్లు పడిపోయాయా? వైసీపీ హయాంలో అమలాపురం, పిఠాపురం, అనంతపురంలలో అంబేడ్కర్ విగ్రహాలు ధ్వంసం చేసినప్పుడు ఢిల్లీకి ఎందుకు వెళ్లలేదు? గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు వైసీపీ రంగులు వేసినప్పుడు అంబేడ్కర్‌కు అవమానం జరిగినట్లు కాదా? అంబేడ్కర్ విగ్రహాల పక్కనే అంతకంటే ఎక్కువ ఎత్తులో రాజశేఖర రెడ్డి విగ్రహాలు పెట్టినప్పుడు మీ మనోభావాలు ఏమయ్యాయి? జగన్ ఆదేశిస్తే పరుగులు తీయడం తప్ప వైసీపీ నేతలకు మనస్సాక్షి లేదు' అని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో గత ఐదేళ్లూ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేశారని, బడుగు వర్గాలను చెప్పు కింద వేసి అణిచివేశారని ఆరోపించారు. వైసీపీ నేతలు ఇప్పటికైనా విగ్రహ రాజకీయాలు మాని ప్రజలు తమను ఎందుకు ఓడించారో ఆత్మ విమర్శ చేసుకొంటే మంచిదని, జగన్ ఎజెండాను మోసుకొంటూ తిరిగితే ఇక ముందు కూడా వారికి భవిష్యత్తు ఉండదని స్పష్టంచేశారు.

గత ఐదేళ్లు రాక్షసుల చేతిలో రాష్ట్రం!

- కూటమి పాలనతో తిరిగి మంచి రోజులు: అయ్యన్నపాత్రుడు



ఆలయం ముందు అయ్యన్న

తిరుమల, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో కొంతమంది రాక్షసుల చేతిలో రాష్ట్రం నష్టపోయిందని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. కూటమి పాలనతో తిరిగి రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయనుకుంటున్నామన్నారు. ప్రజలు మంచి తీర్పునిచ్చి పనిచేసే నాయకుడిని ఎన్నుకున్నారని, రానున్న ఐదేళ్లలో రాష్ట్రానికి పూర్వవైభవం రావాలని శ్రీవేంకటేశ్వరస్వామిని మనస్ఫూర్తిగా కోరుకున్నానని తెలిపారు. శుక్రవారం ఆయన కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

కళంకిత అధికారులను వీఆర్‌లో పెడితే తప్పేంటి?

- నీతులు చెబుతున్న జగన్ వెనక్కి తిరిగి చూసుకోవాలి: వర్ల

అమరావతి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో సకల పాపాలకు పాల్పడిన కళంకిత ఐపీఎస్ అధికారులను వీఆర్‌లో పెడితే తప్పేమిటని టీడీపీ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య ప్రశ్నించారు. ఇప్పుడు గగ్గోలు పెడుతూ తన మీడియాతో నీతులు చెప్పిస్తున్న జగన్ తాను సీఎంగా ఉండగా ఏం చేశాడో వెనక్కి తిరిగి చూసుకోవాలన్నారు. 'జగన్ సీఎంగా ఉండగా 170 మంది వివిధ స్థాయి పోలీస్ అధికారులను సంవత్సరాల తరబడి వీఆర్‌లో ఉంచాడు. ఏ2ని కలిసి ప్రసన్నం చేసుకొంటే తప్ప అనేక నెలల తర్వాత ఐఏఎస్ అధికారి సతీష్ చంద్రకు పోస్టింగ్ రాలేదు. జగన్ తరఫున ఇప్పుడు మాట్లాడుతున్న స్వరణ్‌జీత్ సేన్ వంటి అధికారుల గొంతులు అప్పుడు ఎందుకు లేవలేదు' అని రామయ్య ప్రశ్నించారు. వీఆర్‌లో ఉన్న కొందరు అధికారులు బెంగళూరు వెళ్లి వస్తున్నారని, ఇతర రాష్ట్రాలకు వెళ్లేటప్పుడు డీజీపీ పర్మిషన్ తీసుకోకపోవడం వల్లే వారి హాజరుపై ఉత్తర్వులు ఇవ్వాల్సి వచ్చిందని చెప్పారు.



విశాఖ చేరిన సబ్‌మెరైన్ షాల్కి

విశాఖ కేంద్రంగా సబ్‌మెరైన్ 'షాల్కి' సేవలు

విశాఖపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఇప్పటివరకు ముంబై కేంద్రంగా చేసుకొని పశ్చిమ నౌకాదళంలో సేవలు అందించిన సబ్‌మెరైన్ 'ఐఎన్ఎస్ షాల్కి' ఇకపై విశాఖపట్నం కేంద్రంగా చేసుకొని తూర్పు నౌకాదళంలో పనిచేయనుంది. భారత సముద్ర జలాల్లో చైనా చొరబాట్లు పెరుగుతున్న నేపథ్యంలో ఈ మార్పు చేసినట్టు సమాచారం. ఈ సబ్‌మెరైన్ ఇటీవలె శ్రీలంక పర్యటనకు వెళ్లి వచ్చింది. ఇందులో సిబ్బంది మొత్తం ఇకపై విశాఖ కేంద్రంగా పనిచేయాల్సి ఉంటుంది. శుక్రవారం ఇక్కడి డాక్‌యార్డ్‌కి చేరిన షాల్కికి సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు.